



వాడపల్లి వెళ్లొద్దాం... బ్రహ్మోత్సవాలు చూసొద్దాం - 6లో



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కోట సత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

నిడదవోలు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోట సత్తెమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, ధూప హారతి, నిత్యార్చన, లలితా పారాయణ, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహా నివేదన సమర్పించారు. ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావ డంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.35,920, అన్నదాన విరాళాల ద్వారా రూ.3,517, ప్రసాద విక్రయాల ద్వారా రూ.40,265, పూజ, ఇతర టికెట్ల ద్వారా రూ.70,118.... మొత్తం రూ.1,49,820 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారి వి. హరిసూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్-చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.



ఆనబకాయ @ 40

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సాంబారులోకే కదా అంటూ ఆనబకాయను చాలా మంది చులకనగా తీసి పారేస్తుంటారు. అందుకు తగ్గట్టే ధర కూడా ఏనాడూ రూ.10 మించింది లేదు. మహా అయితే రూ.15 పలికేది. అదే పెద్ద ధరగా, గొప్పగా భావించేవారు. కానీ ప్రతి దానికీ ఏదో ఒకరోజు వస్తుందని పెద్దలు చెప్పినట్టే ఇప్పుడు ఆనబకాయకు రోజు వచ్చింది. మంచి ధర పలుకుతోంది. మహా మహా డిమాండ్ కలిగిన వంకాయలు, బీరకాయలు, బెండకాయలతోపోటీపడుతూ ఆనబకాయ ధర ఎగబాకుతోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కొంచెం లేతగా ఉండే మీడియం సైజు ఆనబకాయ ఒక్కటి రూ.40 పలుకుతుండడం గమనార్హం. రైతు బజార్లలో మాత్రం రూ.30-32 ఉంది. సీతానగరం మండలంలోని గోదావరి తీర ప్రాంతాల్లో ఈ ఆనబకాయలను ఎక్కువగా సాగు చేస్తుంటారు. అయితే కొద్ది రోజుల క్రితం ఎడతెరిపిలేకుండా వర్షాలు కురవడంతో ఆనబపాదులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాదులు కుళ్లిపోవడంతో వాటిని తొలగించి మళ్లీ కొత్తగా నారు వేశారు. ఇప్పుడిప్పుడే కాపునకు వస్తున్నాయి. దీంతో వీటికి రేటు బ్రహ్మాండంగా ఉంది. కొన్నాళ్ల క్రితం వరకు ఐదు, పది రూపాయలు పెడితే ఆనబకాయ దొరికేది. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారింది. ఆనబకాయకూ మంచి ధర లభిస్తోంది. దీంతో ఆనబసాగు చేసే రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



గోదావరి గట్టున హాస్య నటుడు రాజబాబు జయంతి
- 7లో

రాజానగరంలో హైవోల్టేజ్ విద్యుత్ సరఫరా

గృహోపకరణాలు దగ్ధం

రూ.10 లక్షలు మేర ఆస్తి నష్టం
- 7లో



అవినీతి గబ్బిలాలు

అక్రమాలకు అడ్డాగా గోకవరం తహసీల్దారు కార్యాలయం

రెవెన్యూ శాఖలో ఏళ్ల తరబడి వేళ్లూనుకున్న గ్రామ స్థాయి అవినీతి గబ్బిలాలు ఏకంగా మండల స్థాయి అధికారిని సైతం శాసించే స్థాయికి ఎదిగిపోయాయి. కలెక్టరేట్‌నీ గుప్పిట్లో పెట్టుకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అవకతవకలను బయటకు తీయాలని ప్రయత్నించే అధికారులను రాత్రికి రాత్రే బదిలీ చేయిస్తున్నారంటే అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుందో అర్థం చేసుకోవచ్చు. అసైన్డ్ భూముల్లో అవినీతి, మాజీ సైనికుల పేరుతో భూములను స్వాహా చేయడం, ఉద్దేశపూర్వంగా తప్పులు చేసి రైతుల దగ్గర నుంచి డబ్బులు గుంజడం.... ఇలా ఒకటేమిటి అన్నీ అక్రమాలే జరుగుతున్నాయంటూ జనం నుంచి వినిపిస్తున్న ఆరోపణలే. ఈ విషయం ఊరంతా తెలిసినా ఉన్నతాధికారులకు కానరాకపోవడం విస్మయం కలిగించే అంశం. అవినీతితో జేబులు నింపుకునే కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ ఇంటి దొంగలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపణలు హల్‌చల్ చేస్తున్నాయి. విజిలెన్స్ రంగంలోకి దిగినా అక్రమాలను వెలికి తీయడానికి దీర్ఘకాలం పట్టేలా వుంది. గోకవరం తహసీల్దారు కార్యాలయంలో తారస్థాయికి చేరిన అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' కథనం....

గోకవరం (ఆంధ్రజ్యోతి)

గోకవరం తహసీల్దారుగా రావడానికి చాలా మంది జంకుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు కొనసాగిన అవినీతి తమకు చుట్టుకుంటుందేమో అనే మీమాంసతో కొందరు వెనకడుగు వేస్తున్నారు. ఇక్కడ తహసీల్దారుగా ఎవరు చార్జి తీసుకున్నా ఆ సంతకాల ఇంకు ఆరక ముందే బదిలీపై వెళ్లాల్సి వస్తోంది. మండలంలోని ఇద్దరు, ముగ్గురు గ్రామస్థాయి అధికారుల అక్రమాలకు అడ్డుకట్ట వేసే క్రమంలో చిత్రంగా వారే బలైపోతున్నారు. ఈ అవినీతిపరులపై చర్యలకు సిఫారసు చేసిన అధికారులు చిక్కుల్లో పడుతుండగా వీళ్ల మాత్రం కాలర్ ఎగరేసుకుని మరీ మరిన్ని అక్రమాలు చేస్తున్నారు. ఎన్నికల ముందు నాలుగు నెలల వ్యవధిలో ఏకంగా నలుగురు, ఐదుగురు తహసీల్దార్లు రోజుల వ్యవధిలో ఎందుకు బదిలీ అయ్యారో ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్న. ఓ మహిళా తహసీల్దారు చార్జి తీసుకున్నాక... మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలను ఉద్దేశపూర్వకంగా ఇబ్బందిపెడుతూ సొమ్ములు వసూలు చేస్తున్నారని, ఈ తతంగంలో కార్యాలయానికి కూడా పాత్ర ఉందని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. వెంటనే తహసీల్దారు కార్యాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు.

ఈ క్రమంలో ఇద్దరు వీఆర్‌ఏలను సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు, ముగ్గురు వీఆర్వోలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ నివేదిక సిద్ధం చేశారు. ఆ నివేదిక కలెక్టరుకు వెళ్లే కొద్ది గంటల ముందు పైరవీలు జరిగి లక్షలు చేతులు మారాయనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపించాయి. దీంతో అవినీతి అధికారులపై చర్యలకు ఉపక్రమించిన ఆ అధికారికి రాత్రికి రాత్రే బదిలీ ఉత్తర్వులు చేతికి అందాయి. దీంతో మండలం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కార్యాలయంలోని సీసీ కెమెరాలు మాయమయ్యాయి. దీనికి తోడు పలు అవినీతి ఆరోపణలపై ఆమెకు ముందు వెళ్లిన తహసీల్దారే మళ్లీ ఈ సీట్లోకి వచ్చారు. ఈ తంతులో సదరు గ్రామస్థాయి అధికారులు చక్రం తిప్పినట్టు చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంలో ఏజెన్సీలోని ఓ వైసీపీ నేత అండదండలతో మహిళా తహసీల్దారు నివేదిక బుట్టదాఖలు చేసి ఆ రెవెన్యూ అధికారులు సస్పెన్షన్ నుంచి తప్పించుకున్నట్టు ఆరోపణలు లేకపోలేదు. ఆ రెవెన్యూ అవినీతి తిమింగలాల్లో ఒకరు గతంలో సస్పెన్షన్‌కి గురికావడం గమనార్హం. ఇంత జరుగుతున్నా వీళ్లను అంగుళం కూడా కదిలించలేకపోతున్నారనే వాదన ఉంది. ఇప్పటికే వారు మండలంలోనే చక్కగా కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరో తహసీల్దారును తాజాగా సుమారు వారం క్రితం ఇక్కడి నుంచి ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చేశారు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దారు హవా కొనసాగుతోంది.

- అధికారులపై 'కింది స్థాయి వారిదే' పైచేయి
- తీవ్ర ఆరోపణలున్నా చర్యలు శూన్యం
- అవకతవకలపై ఉన్నతాధికారులూ మౌనం
- మాటిమాటికీ తహసీల్దార్ల బదిలీ(ల)లు
- అక్రమాలకు అడ్డుకట్ట వేసే క్రమంలో వారే బలి

గోకవరం తహసీల్దారు కార్యాలయంలో పగలు కన్నా రాత్రి సమయంలోనే అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. అదేంటి బాధ్యతగానే ఉన్నారు కదా అనుకుంటే పప్పులో కాలేసినట్టే! అక్రమ పనులన్నీ ఆ సమయంలోనే పూర్తి చేసేస్తున్నారనే నింద గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులపై బలంగా ఉండేది. రాత్రి పది, పదకొండు గంటలైనా కార్యాలయంలో లైట్ల వెలుగులో వారికి నచ్చిన పనులను నచ్చినట్టు పూర్తి చేసి అవతల వ్యక్తులను సంతృప్తిపరిచే వారనే ప్రచారాన్ని గత అధికారులు మూటకట్టుకున్నారు. ఆ సమయంలో ఎవరైనా వెళ్తే... అధికారులు అర్జెంట్ పని చూసుకుంటున్నారని, ఉదయం రావాలని ఆరు బయటే ఓ వ్యక్తిని పెట్టుకొని సమాధానం చెప్పించేవారని అనుభవం ఎదుర్కొన్న పలువురు వ్యక్తులు చెప్పుకొస్తున్నారు. రాత్రివేళ పని ముగించుకొని ఇంటికి వెళ్తూ ఓ రెవెన్యూ అధికారి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన కూడా ఇటీవలి కాలంలో జరిగింది.

కొత్తగా వచ్చిన అధికారులు కూడా అదే ఆచారాన్ని కొనసాగిస్తుండడం గమనార్హం. తాజాగా శనివారం రాత్రి 8 నుంచి 8.30 గంటల మధ్యలో కార్యాలయం నిండా పలువురు రెవెన్యూ అధికారులు బిజీబిజీగా కనిపించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ ఇద్దరు, ముగ్గురు అధికారుల్లో ఒకరు తహసీల్దారు గదిలో ఏవేవో రికార్డులు చేత పట్టుకుని కనిపించడం విశేషం. కార్యాలయం ఆరుబయట అధిక సంఖ్యలో మోటారు సైకిళ్లు పార్కింగ్ చేసి ఉన్నాయి. రాత్రి సమయంలో కూడా అంత అర్జెంటైన పని ఏమిటో అధికారులకే ఎరుక.



శనివారం రాత్రి 8-8.30 గంటల మధ్యలో కార్యాలయంలో బిజిబిజీగా అధికారులు



శనివారం రాత్రి 8.30 తర్వాత కార్యాలయంలోకి వెళ్తున్న వీఆర్వో

అక్రమాలకు అంతే లేదు

కామరాజుపేటలో సీలింగ్ భూములకు నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు ఇచ్చిన వ్యవహారంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల్లో ఒకరు తతంగం నడిపినట్టు ఆరోపణలు ఉన్నాయి. రెండు గ్రామాలకూ బాధ్యత వహించిన (గతంలో) సదరు రెవెన్యూ అధికారి అవినీతిపై రైతులు అనేక ఆరోపణలు చేశారు. భూ సంస్కరణ చట్టం వచ్చిన తర్వాత గంగంపాలెం పంచాయతీ పరిధిలో 16 ఎకరాల భూమిని సదరు భూస్వామి ప్రభుత్వానికి ఇవ్వలేదు. దీనిపై కోర్టులో వ్యాజ్యం నడిచాక ఆ భూమిని సదరు యజమాని ప్రభుత్వానికి ఇచ్చేశారు. కాలక్రమంలో పేదలు వాటిలో సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. మరో రెవెన్యూ అధికారి ఈ భూముల్లో ఓ ఉన్నత స్థాయి అధికారి అండదండలతో మతలబు చేసే ప్రయత్నం చేయగా.. ఆ విషయం బయటకు పొక్కి ప్రజా సంఘాలు రంగంలోకి దిగాయి. దీంతో ఆ రెవెన్యూ అధికారి వెనక్కు తగ్గారు. గుమ్మళ్లదొడ్డిలో కోట్లాది రూపాయలు విలువ చేసే సీలింగ్ భూమిని గతంలో కార్యాలయంలో పనిచేసిన ఓ అధికారి ఇటీవల ఓ మాజీ ఆర్మీ ఉద్యోగికి ఇచ్చినట్టు చూపించారు. అతను ఎవరో, ఎక్కడి వారో కూడా వివరాలు తెలియట్లేదని గ్రామస్తులు చెప్తున్నారు. దీంతో చాలా ఏళ్ల నుంచి ఆ భూమిపై ఆధారపడి జీవిస్తున్న రైతులు రోడ్డునపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూములను నిరుపేదలకు కాకుండా రాజకీయ పలుకుబడి కలిగిన వారికు కట్టబెట్టారన్న అపవాదు ఇక్కడ అధికారులకు ఉంది.

'సిండికేట్' యత్నాలు

- కొత్తవారికి రాజకీయ ఒత్తిళ్లు
- కుదుటపడని మద్యం షాపులు
- తాత్కాలిక స్థలాల్లో 115 దుకాణాలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మద్యం వ్యాపారులు సిండికేట్ కావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దరఖాస్తు చేసే సమయంలోనే కొందరు సిండికేట్ అయ్యారు. అయినా ఇంకా చాలా మంది దరఖాస్తు చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో 125 షాపులకు దరఖాస్తులు ఆహ్వానించగా 4,384 వచ్చాయి. ఒక్కో దుకాణానికి రూ.2లక్షల వంతున ప్రభుత్వానికి రూ.87.68 కోట్ల ఆదాయం వచ్చింది. ఈనెల 14న లాటరీ తీసి 125 షాపులను అప్పగించిన సంగతి తెలిసిందే. కొత్తవారితో పాటు వేరే ప్రాంతాల వారికీ దక్కాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధుల అనుచరులు కొత్తవారిపై రాజకీయ ఒత్తిళ్లు తెస్తున్నారు. ప్రస్తుతం ఇంకా కొందరికి స్థలాలు దొరకలేదు. గ్రామాల్లో జనాభాను బట్టి హైవేకు 500 మీటర్లు, 250 మీటర్ల దూరంలో షాపు పెట్టాలనే నిబంధన ఉంది. దుకాణ లైసెన్స్‌కు ఏడాదికి నగరాల్లో రూ.80 లక్షలు, గ్రామాల్లో రూ.65 లక్షలు. ఇందులో రెండు నెలల సొమ్ము ముందుగా చెల్లించాలి. నగరాల్లో రూ.14 లక్షలు, గ్రామాల్లో రూ.11లక్షలు ప్రస్తుతం కట్టించుకున్నారు. తాత్కాలిక పర్మిట్లు ఇచ్చారు. జిల్లాలో పాత షాపుల్లో, స్థలం దొరికిన చోట సుమారు 115 దుకాణాలు మొదలుపెట్టారు. కానీ చాలా మంది ఒకే ప్రాంతం, పరిసరాల్లో హడావుడిగా







పెట్టేశారు. వీరిందరికీ త్వరలో శాశ్వత పర్మిట్లు ఇస్తారు. ప్రస్తుతం ఉన్న షాపుల్లో కొన్నింటిని వేరే ప్రాంతాలకు మార్చే అవకాశం ఉంది. నిబంధనల ప్రకారం వాటిని మళ్లీ సరైన ప్రాంతాల్లో పెట్టాల్సి ఉంటుంది. మండలంలో ఎక్కడైనా షాపు పెట్టుకోవచ్చనే నిబంధనతో అందరూ గతంలో బాగా అమ్మే దుకాణాల పక్కనే పెట్టుకోవాలనే ఆలోచనతో ఉండడం ఇబ్బందికరంగా మారింది. దీంతో పది షాపులను ఇంకా ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో దుకాణాలు దక్కించుకున్న వారంతా ఒకేమాటపై మండలాలు, నగరాల్లో షాపులను సర్దుబాటు చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో సిండికేట్‌గా మారుతున్నారు. అలా అయితే ఒకచోట ఎక్కువ అమ్మినా, ఒకచోట తక్కువ అమ్మినా ఎవరికీ ఇబ్బంది ఉండదు.

- కొత్తగా దుకాణాలు దక్కించుకున్న వారికి, నాన్ లోకల్ వారికి స్థానిక రాజకీయ నేతల జోక్యం పెరగడంతో వదిలేయాల్సిన పరిస్థితి కూడా ఉంది. 'రూ.2లక్షల దరఖాస్తుతో షాపు దక్కించుకున్న మీకు షాపునకు రూ.20 లక్షల నుంచి రూ.25లక్షలు ఇస్తాం. వదిలేసి వెళ్లిపోవాలి. లేకపోతే ఇక్కడ మీరు వ్యాపారం చేయలేరు. మద్యం షాపుల నిర్వహణలో అనేక సమస్యలు ఉంటాయి. నాన్ లోకల్‌గా అవి తట్టుకోవడం కష్టమే కదా' అని కొందరికి నచ్చచెప్పే ధోరణిలో బెదిరించడం గమనార్హం.
- నల్లజర్ల మండలంలోని పోతవరంలో దుకాణం గోపాల పురం ప్రాంతానికి చెంది గతం నుంచీ మద్యం వ్యాపారం చేసే వ్యక్తికి దక్కింది. లిక్కర్ వ్యాపారంలో అనుభవం ఉన్న ఓ రాజకీయ నేత అతడిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. సుమారు రూ.20లక్షలు ఇస్తాం. దుకాణం వదిలేయమని ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. కానీ మద్యం వ్యాపారం రుచి మరిగిన సదరు వ్యాపారి ససేమిరా అంటున్నట్టు సమాచారం. ఇది ఇంకా ఒక కొలిక్కి రాలేనట్టు సమాచారం.
- గోపాలపురం నియోజకవర్గంలో ఒక ప్రజాప్రతినిధి అనుచరుడు కూడా దుకాణాలను తమకు ఇచ్చేయాలని, లేకపోతే తమకు వాటా ఇవ్వాలని కూడా ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది.
- రాజమహేంద్రవరం సిటీలో వేరే ప్రాంతాలకు చెందిన వారికి రెండు దుకాణాలు రాగా.... ఓ ప్రజాప్రతినిధి అనుచరుల ఒత్తిడితో కొంత సొమ్ము తీసుకుని దుకాణాలు వదిలేసినట్టు తెలిసింది.
- అనపర్తిలో నాలుగు దుకాణాలను దగ్గరదగ్గరగా పెట్టేయడంతో ప్రస్తుతం వారి మధ్య చర్చలు జరుగుతున్నట్టు సమాచారం.
- పాతచోట, సొంత ప్రాంతాల్లో ఎవరికి వారు దుకాణాలు పెట్టారు. అమ్మకాలు బాగానే సాగుతున్నాయి. ఈనెలాఖరుకి మద్యం వ్యాపారం ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. శాశ్వత పర్మిట్లతో శాశ్వత స్థలాల్లో పెట్టుకుంటారు. ఈలోపు రాజకీయ బెదిరింపులు, సిండికేట్లు కావడం అంతా మామూలుగానే జరిగిపోతోంది. గతంలో మద్యం వ్యాపారుల చేతుల్లోనే దుకాణాలు ఉండేవి. వారు రాజకీయ నేతలు, ఇతరులకు నెలవారీ ముడుపులు ఇచ్చేవారనే ప్రచారం జరిగేది. ఇవాళ రాజకీయ నేతల అనుచరులు కూడా వ్యాపారంలోకి దిగారు. దీంతో వ్యాపారం రసవత్తరంగా మారనుంది.



అధరహో!

- ఆకాశాన్నంటిన ధరలు
- బస్తా (80 కిలోలు) రూ.13,500

జీడి పప్పు... దీని పేరు చెప్తే... నోరు ఉవ్విళ్లూరుతుంది. దైనందిన జీవన విధానంలో జీడిపప్పు లేని వంటకాలు అంతగా రుచించట్లేదని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. అయితే ప్రస్తుత మార్కెట్లో జీడి పప్పు ధరలు ఆకాశాన్నంటడంతో నోటికి రుచించట్లేదు. ఉత్తర భారతంలోని గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాల్లో దసరా, దీపావళి పర్వదినాల్లో జీడిపప్పు వినియోగం ఎక్కువగా ఉండడమే ఇందుకు ప్రధాన కారణంగా వ్యాపారులు చెప్తున్నారు. ఈ కారణంగానే ప్రస్తుతం మన ప్రాంతంలో జీడిపప్పు ధరలు అమాంతంగా పెరిగాయంటున్నారు.

రాజానగరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గత రెండు, మూడేళ్లుగా జీడి పిక్కల బస్తా (80 కిలోలు) రూ.8 వేలు నుంచి రూ.9 వేలు వరకు ఉండేది. ఈ ఏడాది ఏప్రిల్‌లో సైతం ఇవే ధరలు పునరావృతమవుతూ వచ్చింది. గడిచిన ఆరు నెలల్లో పెట్టుబడులకు వడ్డీ, గింజల ఆరుదల కలిపితే ప్రస్తుతం బస్తా రూ.13,500 పలుకుతోంది. గింజలు నిల్వ చేసే అవకాశం లేకపోవడంతో రైతులు ఎప్పటి గింజలను అప్పుడే విక్రయించేశారు. పూర్వపు తూర్పు గోదావరి జిల్లాలో రంపచోడవరం, గోకవరం, నర్సీపట్నం ప్రాంత జీడిపప్పు నాణ్యతకు ప్రసిద్ధిగా వ్యాపారులు చెప్తున్నారు. మన ప్రాంతంలో భారీ పరిశ్రమలు స్వల్పంగా ఉండగా... కుటీర పరిశ్రమలు, దుకాణాలు విరివిగా నడుస్తున్నాయి. మన ప్రాంతం నుంచి జీడిపప్పును బెంగళూరు. మంగుళూరు, హైదరాబాదు ప్రాంతాలకు నిత్యం ఎగుమతి చేస్తుంటారు.

బస్తాకు దిగుబడి...

నాణ్యమైన జీడి పిక్కలు (80 కిలోల) బస్తాకు 20 కిలోల వరకు పప్పు దిగుబడి వస్తుంది. నాసిరకం అయితే 16 కిలోలు వస్తుంది. జీడి పిక్కల నుంచి చిన్నపాటి ముక్క, నూకతో పాటు తొక్కలు కూడా వృథా కావపోవడం విశేషంగా చెప్పొచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలుగా కొనసాగుతున్న ఇవి అనేక మంది మహిళలకు జీవనోపాధి కల్పిస్తున్నాయి.

మార్కెట్లో ప్రస్తుత ధరలు...

జీడి పప్పు ప్రస్తుత మార్కెట్లో మంచి డిమాండ్ సంతరించుకుంది. గత రెండు, మూడేళ్లుగా చూస్తే జీడి పప్పు ఈ సీజన్లో కిలో రూ.550 నుంచి రూ.600 వరకు ఉండేది. ప్రస్తుతం కిలోకి సరాసరి రూ.200 వరకు పెరగడంతో కొనుగోలు చేసేందుకు వెనకాడే పరిస్థితి నెలకొని, అమ్మకాలు సైతం తగ్గాయని వ్యాపారులు వివరిస్తున్నారు. జీడి పప్పు (జంబో గుండు) రకం ప్రస్తుతం కిలో రూ.900 నుంచి రూ.950 వరకు, నెం.2 రకం గుండు రూ.800 వరకు, బద్ద రూ.650 నుంచి రూ.750 వరకు వున్నాయి. గతంలో ఈ సీజన్లో కిలో రూ.550 నుంచి రూ.600 వరకు వున్న జీడి పప్పు ప్రస్తుతం కిలోకి సరాసరి రూ.200 వరకు పెరగడంతో కొనుగోలు చేసేందుకు వినియోగదారులు రాక అమ్మకాలు సైతం తగ్గాయని వ్యాపారులు వాపోతున్నారు.




అట్టపెట్టెల్లో ఎగుమతికి సిద్ధం చేసిన జీడి పప్పు

రేపు రాజానగరంలో జాబ్ మేళా

రాజానగరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి కల్పనలో భాగంగా నిరుద్యోగ యువతకు రాజానగరంలో మంగళవారం నిర్వహించతలపెట్టిన జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని తూర్పు గోదావరి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో మూడు కంపెనీలు పాల్గొంటున్నాయని జిల్లా ఉపాధి కల్పన అధికారి హరిశ్చంద్రప్రసాద్ తెలిపారు. ఎస్ఎస్‌సీ/ఇంటర్/డిగ్రీ/డిప్లొమా, ఐటీఐ, డి.ఫార్మసీ, బీ.ఫార్మసీ, ఎంబీఏ విద్యార్హతలతో 19 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు పూర్తి వివరాలతో రిజిస్టరు అయి రెజ్యూమ్‌తో రాజానగరం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8328507473, 7396740041 నెంబర్లలో కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఓపెన్‌సైట్ కేటగిరీలో రైఫిల్ షూటింగ్ జాతీయ జట్టు ఎంపిక
- 7లో





'ఈవీ'ధంగా పరుగులు!

నగరాల్లో ఎటుచూసినా కాలుష్యం. కంటికి కనిపించకుండానే గాలిలో కలిసి హానికరంగా మారుతోంది. వాహనాల నుంచి వచ్చే పొగ కారణంగా పర్యావరణం దెబ్బతింటోంది. గాలిలో తగ్గుతున్న నాణ్యతే దీనికి నిదర్శనం. దేశంలో చాలా నగరాల్లో ఏక్యూఐ (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) సంఖ్య 100 దాటుతోంది. ఇది ఆందోళన కలిగించే అంశమే. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లోను ఈ సంఖ్య ఒక్కోసారి 100 దాటుతోంది. ఈ సమస్య పరిష్కారానికే కేంద్రం ఎలక్ట్రికల్ వాహనాలపై దృష్టి పెట్టింది. దీంతో నెమ్మదిగా వీటి అమ్మకాలు జోరందుకుంటున్నాయి. పెట్రోలు వాహనాలతో పోలిస్తే ఖర్చు తక్కువ. పర్యావరణహితం కూడా. ఇప్పుడిప్పుడే సామాన్యులు సైతం 'ఈవీ'ధంగా అడుగులు వేస్తున్నారు. దీంతో ఈ-బైక్‌లు, ఈ-కార్లు, ఈ-ఆటోలు రోడ్ల మీద సందడి చేస్తున్నాయి.

ఈవీ వాహనాల వాడకం పెరుగుతోంది..

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రిజిస్ట్రేషన్ అయిన ఈ వాహనాలు

ఆర్టీవో పరిధి	ఎలక్ట్రిక్ (బీవోవీ)	ప్యూర్ ఈవీ	స్ట్రాంగ్ హైబ్రిడ్‌ఈవీ
రాజమహేంద్రవరం	1015	380	23
కాకినాడ	1295	373	22
అమలాపురం	217	76	5
మండపేట	201	47	4
కత్తిపూడి	165	37	3
రంపచోడవరం	31	5	0



- రాజమహేంద్రవరం, కాకినాడ నగరాల్లో భారీగా వాహన కాలుష్యం
- గాలిలో తగ్గుతున్న నాణ్యత.. 100 దాటుతున్న ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- వాహనాల కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాలే పరిష్కారం
- నగరాల్లో ఇప్పుడిప్పుడే పెరుగుతున్న ఈవీల సంఖ్య
- ఈ-బైక్‌లు, ఈ-కార్లు, ఈ-ఆటోలపై పెరుగుతున్న ఆసక్తి
- ఈ-బస్సులపై ఆర్టీసీ ప్రత్యేక దృష్టి.. ఇప్పటికే ప్రతిపాదనలు
- కాలుష్యరహితం.. పర్యావరణహితం.. ఖర్చు మితం..



తగ్గుతున్న గాలి నాణ్యత..



పొల్యూషన్ బోర్డు ప్రతి వారం నిర్వహించే పరీక్షల్లో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో గాలిలో నాణ్యత తగ్గుతోందని తేలింది. గాలిలో నాణ్యతను గుర్తించే ప్రక్రియను ఎయిర్ క్వాలిటీ ఇండక్స్(ఏక్యూఐ) అంటారు. గాలిలో ఉండే పీఎంలు(పర్టిక్యులర్ మేటర్), నైట్రోజన్ డయాక్సైడ్(ఎన్‌వో2), ఓజోన్(ఓ3), సల్ఫర్ డయాక్సైడ్(ఎస్‌వో2), కార్బన్ మోనోక్సైడ్ (సీవో)లను బట్టి ఈ ఏక్యూఐను నిర్ధారిస్తారు. వీటిలో పీఎంలు వాతావరణంలో కలిసిపోయి చిన్న కణాలుగా ఉంటాయి. మిగిలినవి వాయురూపంలోనే ఉంటాయి. ఈ ప్రమాదకర వాయువులన్నీ పరిశ్రమలు, వాహనాల కాలుష్యంనుంచే విడుదలవుతాయి. ఈ ఏక్యూఐ ఎక్కువగా ఉంటే గాలిలో నాణ్యత తగ్గుతున్నట్టు లెక్క. 50లోపు ఉంటేనే శ్రేయస్కరం. 100లోపు ఉంటే అంతంతమాత్రం. 100 దాటితే ఆందోళనకరం.

(రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)/ కార్పొరేషన్(కాకినాడ), ఆంధ్రజ్యోతి:

కాకినాడ జిల్లా పరిధిలో 20లక్షల92వేలమంది జనాభా ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 18లక్షల33వేలమంది జనాభా ఉన్నారు. వీటిలో కాకినాడ,రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లుగా ఉన్నాయి. ఆస్పత్రులు, కళాశాలలు, పెద్దపెద్ద సంస్థలు వంటివన్నీ ఈ నగరాల్లోనే నెలకొల్పారు. దీంతో పరిసర ప్రాంతాల్లోని చాలామంది ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, చదువుల నిమిత్తం నగరాల్లోనే స్థిరపడుతున్నారు. దీనివల్ల ఇక్కడ జనాభా తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఈ రెండు నగరాల్లో వాహనాల సంఖ్య భారీగా ఉంది. వాటి నుంచి వెలువడే కాలుష్యం ఈ నగరాలపై ప్రభావం చూపిస్తోంది. దీని నియంత్రణకు గాను మొక్కలు విరివిగా పెంచాల్సి ఉంది. నగరమంతా పచ్చదనం కనిపించాలి. తద్వారా ప్రజలకు స్వచ్ఛమైన గాలి పీల్చే అవకాశం ఉంటుంది. కానీ, కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో మొక్కల పెంపకం ఉన్నప్పటికీ ఆశించినస్థాయిలో లేదు. దీనివల్ల కాలుష్యం పెరిగినప్పుడల్లా గాలిలో నాణ్యత తగ్గుతోంది. ఈ గాలి పీల్చడం ద్వారా ప్రజలకు పలు సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ నేపథ్యంలో వాహనాల నుంచి వెలువడే కార్బన ఉద్గారాల సమస్యను పరిష్కరించేందుకు ఎలక్ట్రికల్ వెహికల్స్‌ను పెంచాలన్న వాదన ఉంది. ఇందులో భాగంగా మొదటి అడుగుగా నగరపాలక సంస్థల పరిధిలో చెత్తసేకరణకు ఈ-రిక్షాలు, ఈ-కార్ట్ వాహనాలనే వినియోగిస్తున్నారు. ప్రజల్లోను ఈవీల వినియోగంపై ఆసక్తి కలుగుతోంది.

ఉమ్మడి జిల్లాలో ఈ-బైక్‌లు, ఈ-కార్లు

ఉమ్మడి తూర్పుగోదావరిలోని కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంల్లో ఈ-బైక్‌లు విక్రయించే షోరూంలు ఇప్పటికే ఏర్పాటయ్యాయి. మూడు జిల్లాలో నెలకు కనీసం 50 వరకూ ఇవి రోడ్డెక్కుతున్నాయి. ఈ-బైక్‌లు రూ.50వేలు మొదలుకొని రూ.2లక్షల వరకూ వివిధ శ్రేణుల్లో అందుబాటులో ఉన్నాయి. ఇక ఈవీ కార్లను ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలు ఇప్పటికే మార్కెట్‌లోకి దింపాయి. వీటి ధరలు భారీగానే ఉంటున్నాయి. దీంతో సంపన్న వర్గాలు మాత్రమే వీటిపై దృష్టిపెట్టాయి.



ఆర్టీసీలో 150 ఈవీలకు ప్రతిపాదనలు

కాకినాడ, రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోల్లో కూడా ఎలక్ట్రికల్ బస్సులకు ఇప్పటికే ప్రతిపాదనలు వెళ్లాయి. కాకినాడ జిల్లాలో ఆర్టీసీకి ప్రస్తుతం 25 బీఎస్6 బస్సులు వచ్చాయి. వీటిలో 21 బస్సులు సూపర్‌లగ్జరీ, 4 బస్సులు స్లీపర్ కోచ్‌లు ఉన్నాయి. ఇవీ పర్యావరణహితంగా ఉంటాయని ఆర్టీసీ అధికారులు చెప్తున్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా కాకినాడ ఆర్టీసీ డిపోకి 50, రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోకి 100 చొప్పున ఈవీ బస్సులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇవి ఒక్కో బస్సు రూ.1.50 కోట్లకు కలిపి మొత్తం రూ.225కోట్లతో కొనుగోలుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. వీటిని ఉమ్మడి జిల్లా పరిధిలో తిప్పేలా ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు వీటి నిమిత్తం మొత్తం 25చోట్ల చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో హైదరాబాద్, విజయవాడ నుంచి రాజమహేంద్రవరం మీదుగా కొన్ని ఎలక్ట్రికల్ బస్సులు తిరుగుతున్నాయి.



మన నగరాల్లో ఏక్యూఐ

ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గాలిలో నాణ్యత ఆయా సమయాలను బట్టి మారుతోంది. ఆదివారం, ఇతర సెలవురోజుల్లో వాహనాల ప్రయాణం తక్కువగా ఉంటుంది కాబట్టి అప్పుడు సాధారణ స్థితి ఉంటోంది. ఇతర రోజుల్లో ఎక్కువగా ఉంటోంది. దీనివల్ల గాలిలో నాణ్యత తగ్గి ఒక్కోసారి ఆందోళనకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తాజాగా నిర్వహించిన ఏక్యూఐ పరీక్షల్లో కాకినాడలో ఓ సందర్భంలో అత్యధికంగా 108 ఉందని తేలింది. రాజమహేంద్రవరంలో కూడా ఓ సందర్భంలో అత్యధికంగా 115 వరకూ ఉందని నిర్ధారణైంది. ఇది ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. రెండుచోట్ల ఆదివారం 50 లోపే ఉంది.

కంటికి కనిపించని శత్రువు

స్విట్జర్లాండ్‌కి చెందిన ఓ సంస్థ అధ్యయనంలో అత్యంత కాలుష్యభరిత దేశాల్లో భారత్ ఐదో స్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో మన దేశంతో సహా చాలా దేశాలు ఎకో ఫ్రెండ్లీ విధానాలను అనుసరిస్తున్నాయి. దీనిలోభాగంగా వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి ఎలక్ట్రిక్ వాహనాలను ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారు. వాయుకాలుష్యానికి ఏటా ప్రపంచవ్యాప్తంగా 80లక్షల మంది ప్రాణాలు పోతున్నాయి. పెట్రోవాహనాలు, ఫ్యాక్టరీలు విడుదల చేసే పొగలోని సూక్ష్మధూళి, రసాయన కణాలు,కర్బన ఉద్గారాలు ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండెపోటుకు కారణమవుతూ ప్రాణాలను కబళిస్తున్నాయి. పిల్లల్లో శ్వాస, నాడీ వ్యవస్థలను వాయు కాలుష్యం నాశనం చేస్తోంది. పిల్లల్లో న్యూమోనియా కేసుల సంఖ్య పెరగడం శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇప్పటికే పెట్రో వాహనాల కొనుగోళ్లపై హిమాచల్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈనిర్ణయం ఈవీల కొనుగోలుకు ఊతంగా మారి గ్రీన్ అండ్ క్లీన్ లక్ష్య సాధనకు దోహదపడుతుందని భావిస్తున్నారు.



నగరాల్లో ఈ-ఆటోల పరుగులు

ఎలక్ట్రికల్ విప్లవం మొదలు కావడంతో ఈవీ ఆటోలు కూడామార్కెట్‌లోకి వచ్చేశాయి.నాణ్యతను బట్టి రూ.1.5 లక్షల నుంచి రూ.4లక్షల వరకు వివిధ ధరల్లో అందుబాటులో ఉంటున్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం వంటి ప్రధాన నగరాలతోపాటు అమలాపురం, రావులపాలెం, మండపేట, సామర్లకోట, పిఠాపురం, తుని, కొవ్వూరు పట్టణాల్లోను ఈ-ఆటోలు పరుగులు పెడుతున్నాయి. వీటి మోడళ్లు కూడా కాస్త భిన్నంగా ఉండడంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో చార్జింగ్ స్టేషన్లు

ఈవీలకు చార్జింగ్ స్టేషన్లు పెరగాల్సి ఉంది. ప్రస్తుతం వినియోగదారులు ఈ-బైక్‌లు, ఈ-ఆటోలకు ఇళ్ల వద్దే చార్జింగ్ పెట్టుకుంటున్నారు. వీటికి కనీసం నాలుగైదు గంటలపైనే సమయం పడుతోంది. ఎథర్, టాటా, రెన్ వంటి మోటారు కంపెనీలు తమ సర్వీస్ సెంటర్ల వద్ద చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాయి. వీటివద్ద బైక్‌లు, ఆటోలు, కార్లకు చార్జింగ్ పెట్టుకునే వీలు కలుగుతోంది. ప్రస్తుతం కాకినాడ, రాజమహేంద్రవరంల్లో మాత్రమే ఇవి అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో తుని నుంచి రాజమహేంద్రవరం మధ్య నాలుగైదు చోట్ల పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. రాజానగరం దగ్గర్లో రెండు, గండేపల్లి మండలం మురారిలో ఒకటి, జగ్గంపేట మండలం జెడ్.రాగంపేటలో ఒకటి, తుని మండలం తేటగుంటలో ఒకటి ఉన్నాయి. హైవేపై ప్రయాణించే ఈవీ కార్లు, బస్సులకు ఈ స్టేషన్లవద్ద చార్జింగ్ పెడుతున్నారు.



రాజానగరం సమీపంలో ఈవీ చార్జింగ్ స్టేషన్

బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవం

నేటి నుంచి వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఘనంగా ఏర్పాట్లు

ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాలంకరణ



ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి):


కోనసీమ తిరుమల శ్రీదేవి భూదేవి సమేత వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 21వ చవితి సోమవారం నుంచి 29 మంగళవారం వరకు తొమ్మిది రోజుల పాటు తిరుమల తరహాలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఎప్పుడూ లేని విధంగా ప్రచార మాధ్యమాల ద్వారా భక్తులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. అనకాపల్లి నుంచి విజయవాడ వరకు జాతీయ రహదారుల వద్ద బ్రహ్మోత్సవ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతంలో ఎల్‌ఈడీతో డిజిటల్ ప్రచారం నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే హోమాలకు యాగశాలను కూడా సిద్ధం చేశారు. వసంత మండపం ప్రాకార మండపాలలో బెంగళూరు పుష్పాలతో అలంకరించే పనిలో ప్రత్యేక నిపుణులు నిమగ్నమయ్యారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. రావులపాలెం నుంచి బొబ్బర్లంక వాడపల్లి, లొల్ల ప్రాంతాలలో ముఖ ద్వారాలను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.



యాగశాల



ప్రత్యేకాలంకరణ



పుష్పాలంకరణ

నేడు శేషవాహన సేవ

సోమవారం ఉదయం 9.30 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అకల్మష హోమం, సాయంత్రం ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారు. రాత్రి 7.30 గంటలకు పరావాసుదేవ అలంకరణతో శేషవాహనంపై శ్రీవారు తిరు వీధులలో విహరించనున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

తొమ్మిది రోజుల పాటు నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ ప్రదర్శనలు అందించనున్నారు. కేరళ విలక్ డ్యాన్స్, గురపై వేషాలు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారణాసి డ్యాన్సు, మహారాష్ట్ర వాయిద్యం, కరీంనగర్ తీన్‌మార్, తిరుపతి సేక్సోఫోన్, కేరళవాయిద్యం, డోలు సన్నాయి, భరతనాట్యం తదితర వాటిని ప్రదర్శించనున్నారు.



ప్రత్యేక ఏర్పాట్లు చేశాం..

ఉప కమిషనరు సూర్యచక్రధరరావు



వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి పుణ్యక్షేత్రానికి నెల రోజుల క్రితమే ఉపకమినరుగా బాధ్యతలు స్వీకరించా.. వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాం. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒడిసా రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నాం. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనంతో పాటు స్వామివారి ప్రసాదాలు భక్తులకు అందించనున్నాం. స్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తులు తిలకించేలా ఏర్పాట్లు చేపడుతున్నాం.

ఐపీఎల్ తరహాలో గోదావరి క్రికెట్ ప్రీమియర్ లీగ్



ప్రీమియర్ లీగ్ క్రికెట్ లోగో ఆవిష్కరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

» డిసెంబరు 1 నుంచి 12 వరకు కాకినాడలో నిర్వహణకు ఏర్పాట్లు

కాకినాడఅర్బన్, అక్టోబరు 20: కాకినాడలో మొదటిసారిగా ఐపీఎల్ తరహాలో జీపీఎల్ ప్రీమియర్‌లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తుండడం అభినందనీయమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. డిసెంబరు 1 నుంచి 12 వరకు గోదావరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ కాకినాడలో నిర్వహిస్తారన్నారు. ఆదివారం ఆయన నివాసంవద్ద టోర్నమెంట్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12రోజులపాటు జరిగే ఈ టోర్నమెంటులో ఆరు జట్లుగా ఏర్పాటుచేసి పోటీలు పెడతారన్నారు. మిరాకిల్ ఇంజనీరింగ్ సౌజన్యంతో ఏర్పాట్లు చేస్తారన్నారు. అమ్రపై స్పోర్ట్స్ ముఖ్య కార్యదర్శి ఎస్.కరుణాకర్ మాట్లాడుతూ డేవిడ్ కాకినాడ కింగ్స్, చిట్ల కిరణ్ పిఠాపురం పాంథర్స్, హరీష్ కోనసీమ లయన్స్‌లోవస్ రామచంద్రపురం రాయల్స్, జీ వీ కే తుని డస్కస్, షణ్ముఖ గోదావరి రైడర్స్ జట్ల మధ్య పోటీలు నిర్వహిస్తామన్నారు. టోర్నమెంట్‌కు వైస్‌చైర్మన్‌గా చిట్టూరి డేవిడ్ వ్యవహరిస్తారన్నారు. ఆటగాళ్లకు వేలం నిర్వహించి 20-20తరహాలో పోటీలకు శ్రీకారం చుట్టారు.

ముగిసిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు

కాకినాడఅర్బన్, అక్టోబరు 20: మూడురోజులుగా కాకినాడలో నిర్వహిస్తున్న అంతర్‌జిల్లాల స్కేటింగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. అండర్-11, 14, 17, 19 విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్, హరీష్ చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్, పరిశీలకులు ఎస్.దిలీప్‌కుమార్, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, కార్యదర్శి కె.నూకరాజు, స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, దొరైస్వామి, జి.సునీల్‌కుమార్, పరుశరామ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికలు

నవంబరు రెండోవారంలో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఎంపికైన క్రీడాకారుల వివరాలివి. అండర్-11 విభాగంలో బాలికల్లో.. విశాఖకు చెందిన దూసర్లపూడి ప్రియానందశ్రీవర్షిణి, షాయిఖ్ దిల్‌సద్ అమీనా, చాంతాటి చార్వి ఉన్నారు. బాలురలో.. తూర్పుగోదావరికి చెందిన ఎస్.శ్యామ్‌సుందర్‌రెడ్డి, అనంతపురానికి చెందిన ఆర్.సాయి కార్తీకరెడ్డి, చిత్తూరుకు చెందిన సి.జతిన్‌రెడ్డి ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో తూర్పుగోదావరికి చెందిన కె.భవ్యశ్రీ, చిత్తూరుకు చెందిన కామిశెట్టి ఖ్యాతి, కృష్ణాజిల్లాకు చెందిన సాన్వి రఫియా, బాలురలో తూర్పుగోదావరికి చెందిన ఎ.మహీధర్ రాజకుమార్, ఆర్.శ్రీఅఖిల్‌రిషివర్మ, కృష్ణాజిల్లాకు చెందిన బలరాం ఉన్నారు. అండర్-17 బాలికల్లో తూర్పుగోదావరికి చెందిన మహమ్మద్ హనీఫ్‌మోహన్, విశాఖకు చెందిన పెరవలి శ్రీకీర్తి, నెల్లూరుకు చెందిన పి.యశశ్విని, బాలురలో చిత్తూరుకు చెందిన షాయిక్ అమీర్, కృష్ణాజిల్లాకు చెందిన పి.యోషిత్ రెడ్డి, మధులీలావెంకట సుధీర్ ఎంపికయ్యారు.

క్వాడ్ విభాగంలో అండర్-11 బాలబాలికల్లో గుంటూరుకు చెందిన తన్మయినాగదుర్గ, నెల్లూరుకు చెందిన సీహెచ్.నాగజ్యోత్స్న, తూర్పుగోదావరికి చెందిన మోసా హనీసుసాన్, విరోధి రిషీశ్వర్, విశాఖకు చెందిన కరణం జైచందన్, గుంటూరుకు చెందిన వై.జినేష్‌సాయి ఉన్నారు. అండర్-14లో నెల్లూరుకు చెందిన నందిని, ఆద్విరమ్య, కృష్ణాజిల్లాకు చెందిన తనూజసాయి, తూర్పుగోదావరికి చెందిన నిఖిల్ ఈశ్వర్, చందు శ్రీధర్, కృష్ణాజిల్లాకు చెందిన ఫర్దీస్ ఉన్నారు.

అండర్-17 క్వాడ్ విభాగం.. బాలికల్లో తూర్పుగోదావరికి చెందిన వీవీ వీరవర్షిని, విశాఖకు చెందిన విద్యా ప్రజాపతి, నెల్లూరుకు చెందిన ఎస్.జెస్మిత, బాలురలో విశాఖకు చెందిన పూటిపల్లి జాన్సన్, అంబుజి లోహిత్‌సాయి, బుడ్డిగ శశాంక్ ఎంపికయ్యారు. అండర్-19లో చిత్తూరుకు చెందిన కె.స్నేహకృతి, కృష్ణాకు చెందిన జయశ్రీసాయి, ఆర్.జశ్వంత్, చిత్తూరుకు చెందిన కె.వింధ్యన్ జట్టులో స్థానం దక్కించుకున్నారు.


పొల్లూరు జలపాతం వద్ద శిక్షణలో పాల్గొన్న తెలంగాణా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

తెలంగాణ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లకు
పొల్లూరు జలపాతం వద్ద శిక్షణ

మోతుగూడెం, అక్టోబరు 20: చింతూరు మండలం మోతుగూడెంలో ఆదివారం తెలంగాణ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఆంధ్రాలో పొల్లూరు జలపాతం వద్ద టేక్ ప్లాంటేషన్ వద్ద అటవీ ప్రాంతంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. లక్కవరం రేంజర్ సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి, లక్కవరం రేంజర్ నానాజీ, డీఆర్వో భాను ప్రకాష్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



తలుపులమ్మ ఆలయానికి రూ.3.27లక్షల ఆదాయం

తునిరూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి తరలివచ్చిన భక్తజనంతో ఆలయంలో అమ్మవారి నామస్మరణ మార్మోగింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరారు. అమ్మవారి విశేషలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక క్యూలైన్‌లో బార్లు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు దేవస్థానం సమకూర్చిన వసతి గదులు, ఆరుబయట వంట షెడ్డుల్లో భక్తులు వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో విశ్వనాథ్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం ఒక్కరోజే అమ్మ వారికి రూ.3.27లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి..
టీకాస్త్రం

- వారి భవితకు టీకాలే రక్ష ● ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- గర్భిణులు, పిల్లలకు పదేళ్ల వరకూ టీకాలు
- అలసత్వం వహిస్తే అనారోగ్య సమస్యలు తప్పవు
- తల్లిదండ్రులదే పూర్తి బాధ్యత

శంఖవరం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల ఇంట్లో ఆనందానికి కొదవ ఉండదు. వారు చేసే ప్రతిచర్య మనల్ని సంతోషంలో ముంచేస్తుంది. వారికి చిన్నపాటి జ్వరం వచ్చినా కన్నవారి హృదయం విలవిల్లాడుతుంది. అందుకే వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటారు. వారి సంపూర్ణ ఆరోగ్యానికి రాష్ట్రప్రభుత్వం కూడా ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. మహిళలు గర్భం దాల్చిన దగ్గర నుంచి బిడ్డకు పదో ఏట వచ్చేవరకూ అన్నిరకాల టీకాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ఈక్రమంలో టీకాల ప్రాముఖ్యత వాటిని నిర్లక్ష్యం చేస్తే కలిగే నష్టాల గురించి తల్లిదండ్రులు తప్పకుండా తెలుసుకోవాలి. టీకా అనేది చిన్నారులకు వజ్రాయుధం. అది చిన్నారుల్లో రోగనిరోధకశక్తిని పెంచి ప్రాణాంతక వ్యాధులనుంచి రక్షిస్తుంది. సరైన సమయంలో స్పందిచకపోతే జీవితాంతం పిల్లలు ఇబ్బందిపడతారు.

పదేళ్లు వచ్చే వరకూ..

మాతాశిశు సంక్షేమం కోసం ఎక్స్‌టెండెడ్ ప్రోగ్రాం ఆఫ్ ఇమ్యూనైజేషన్(ఈపీఐ)ని ప్రవేశపెట్టారు. దీన్ని యూనాని యూనివర్సల్ ఇమ్యూనైజేషన్‌గా దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టారు. గర్భిణులకు, అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి పదేళ్ల పిల్లల వరకూ ప్రభుత్వమే ఉచితంగా టీకాలను అందజేస్తోంది. పట్టణాల్లో ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులు పల్లెల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో టీకాలను ఉచితంగా వేస్తారు. ప్రధానంగా 12 రకాల టీకాలు పిల్లలకు తప్పనిసరిగా వేయించాల్సి ఉంది. టీకాలు వేయించకపోతే వచ్చే వ్యా ధులు చిన్నారులను జీవితకాలం వేధిస్తాయి. పుట్టిన బిడ్డనుంచి పదేళ్ల వరకూ సరైన సమయంలో టీకాలు వేయించుకోవాలి. లేకపోతే క్షయ, రక్తహీనత, పోలియో, కేన్సర్, వైరల్ డయేరియా, కీళ్లవాతం, ధనుర్వాతం, తట్టు, రుబేలా, మెదడువాపు, కోరింత దగ్గు, రేచీకటి వంటి రోగాలు చుట్టుముడతాయి.

ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

గతంలో పేదింట్లో కాన్పంటే భయపడే పరిస్థితి కానీ ఇప్పుడు అన్ని పరీక్షలు ప్రభుత్వమే చేస్తూ సాధ్యమైనంత వరకూ సాధారణ కాన్పులు అయ్యేలా మందులు వేస్తున్నారు. అన్ని విధాలా ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. దీనిలోభాగంగా ప్రతినెలా ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తూ దూర ప్రాంతాలనుంచి వచ్చే తల్లులకు ఉచితంగా భోజనం అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, తల్లులకు ఉచితంగా పౌష్టికాహారం అందిస్తున్నారు.

సబ్ సెంటర్లలోనే టీకాలు

ప్రతివారం ఆరోగ్య ఉపకేంద్రాల్లో టీకాలను ఉచితంగా అందిస్తున్నారు. మాతాశిశు పేరుతో తల్లులకు ఒక పుస్తకాన్ని అందించి అందులో టీకాల వివరాలను పొందుపరుస్తారు. టీకాకు వచ్చిన సమయంలో మళ్లీ ఏ తేదీ రావాలి, మళ్లీ వచ్చినప్పుడు వేసే టీకా ఏంటని పుస్తకంలో తెలియజేస్తారు. టీకాలను ఎప్పటికప్పుడు పీహెచ్‌సీలను తీసుకొచ్చి ఐస్‌బాక్సులో భద్రపరుస్తారు. టీకా వేశాక చిన్నారులను గమనించి కొద్దిసమయం పోయాక పంపిస్తారు.


కత్తిపూడి సబ్‌సెంటర్‌లో వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

ప్రధానంగా వేయించాల్సిన టీకాలు

వయస్సు	ఇవ్వాల్సిన వ్యాక్సిన్లు
పుట్టిన వెంటనే..	బీసీజీ, ఓపీవీ, హెపటైటిస్-బీ,
6 వారాలకు..	పెంటావాలెంట్-1, ఓపీవీ-1, ఐపీవీ-1, రోటావైరస్ వ్యాక్సిన్ 1, పీసీవీ
10వారాలకు..	పెంటావాలెంట్ -2, ఓపీవీ-2, రోటావైరస్ వ్యాక్సిన్-2
14 వారాలకు..	పెంటావాలెంట్ -3, ఓపీవి-2, ఐపీవీ-2, రోటావైరస్-3, పీసీవీ
9 నెలలకు..	మిజిల్, జేఈ-1, విటమిన్ ఏ-1పీసీవీ
16 నెలలకు..	టీపీటీ, ఓపీవీ, మీజిల్స్, విటమిన్ ఏ-2(బూస్టర్)
5-6 సంవత్సరాలకు..	టీపీటీ, విటమిన్-ఏ 9వ డోస్
10, 16 సంవత్సరాలకు..	టీడీ డోస్
గర్భిణికి..	12వారాలలోపు టీడీ-1, 4వారాల తర్వాత డీటీ-2

తల్లిదండ్రులు తెలుసుకోవాల్సినవి..

కార్పొరేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోంది. ప్రభుత్వం, వైద్యులు ఎన్నిరకాల సలహాలు, సూచనలు చేసినా పిల్లల సంరక్షణ విషయంలో తల్లిదండ్రులదే ప్రధాన భూమిక. గర్భం దాల్చిన దగ్గరనుంచి చిన్నారులకు పదేళ్లు వచ్చేవరకూ వ్యాక్సిన్ల విషయంలో పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలి. ఏ టీకా దేనికి వేశారు, మళ్లీ తర్వాత టీకా ఎప్పుడు వేయించుకోవాలి, టీకా వేశాక కార్డులో నమోదు చేశారా లేదా అనే విషయాలను పరిశీలించుకుని కార్డును భద్రపరుచుకోవాలి. నెలసరి బరువు చెక్ చేసుకోవడం వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి. కొన్నిసార్లు టీకాలు వేసినప్పుడు సైడ్ ఎఫెక్టులు వస్తుంటాయి. వాటిపై వైద్యులను అడిగి తగిన సలహాలు పాటించాలి.

రైఫిల్ షూటింగ్‌లో జాతీయ జట్టు ఎంపిక

ఏపీ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్


ఓపెన్‌సైట్ కేటగిరీలో రైఫిల్ షూటింగ్‌లో ఓవరాల్ చాంపియన్‌గా మొదటిస్థానంలో నిలిచిన అనంతపురం జట్టు

దివాన్‌చెరువు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఓపెన్‌సైట్ కేటగిరీ విభాగంలో పాల్గొనే జాతీయ జట్టును ఎంపికచేసినట్టు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. ఏపీ పాఠశాల విద్యాశాఖ, క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రాజానగరం మండలం సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో జరుగుతున్న ఏపీ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్ ఆదివారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎంపికైన రాష్ట్ర జట్టును ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి స్వామి ప్రకటించారు. ఓపెన్‌సైట్ కేటగిరిలో అండర్-14 బాలికల విభాగంలో వి.జాగ్రుతిరెడ్డి(వైఎస్ఆర్ కడప), ఎస్.జోహసిద్రా(తూర్పుగోదావరి), డి.సౌమ్యశ్రీ (పశ్చిమగోదావరి), అండర్ -14 బాలురు విభాగంలో ఎ.లిఖిత్‌రామ్ (పశ్చిమగోదావరి), డి.వేద్‌వీక్షిత్(తూర్పుగోదావరి), వి.తీక్షణసాయి (అనంతపురం) ఎంపికయ్యారని స్వామి తెలిపారు. అండర్-17 బాలికల విభాగంలో ఎం.సాయి ఐశ్వర్య(కర్నూలు), సి.గురుప్రవల్లిక(అనంతపురం), వి.ఫైజాసుల్తానా(వైఎస్ఆర్ కడప), అండర్-17 బాలుర విభాగంలో ఎస్ఎండీ ఉబయిద్(వైఎస్ఆర్ కడప), పి.సాయి సుమేష్(తూర్పుగోదావరి), ఎల్.రామ్‌జిగ్నేష్(కర్నూల్) ఎంపికయ్యారన్నారు. అలాగే అండర్-19 బాలికల విభాగంలో ఎస్‌డీ మహేజమీన్(వైఎస్ఆర్ కడప), ఎం.పల్లవి (కర్నూల్), ఎం.మల్లికాబాయ్(అనంతపురం), అండర్-19 బాలురు విభాగంలో ఏవీ సూర్య రామసంజీవరెడ్డి(వైఎస్ఆర్ కడప), టి.వెంకట అఖిల్ (అనంతపురం), డి.సాయితేజ(తూర్పుగోదావరి) ఎంపికయ్యారన్నారు. ఓవరాల్ చాంపియన్‌లు అనంతపురం, కర్నూల్, వైఎస్ఆర్ కడప జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచాయని స్వామి తెలిపారు. ఓపెన్‌సైట్ కేటగిరిలో ఎంపికైన జట్టు డిసెంబరు 24 నుంచి వచ్చేఏడాది జనవరి ఒకటో తేదీ వరకూ భోపాల్‌లో జరిగే జాతీయపోటీల్లో పాల్గొంటుందని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి స్వామి తెలిపారు. ఓపెన్‌సైట్ కేటగిరిలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఉపవిద్యాశాఖాధికారి నారాయణ, రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ టి.స్వరూప్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి స్వామి, పీఈటీలు పాల్గొన్నారు.

అందరి హృదయాల్లో నిలిచిన రాజబాబు

హాస్య నటుడు రాజబాబు జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబర్ 20: ప్రముఖ హాస్య నటుడు రాజబాబు 88వ జయంతి వేడుకలు ఆదివారం గోదావరి గట్టున ఉన్న రాజబాబు విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. రాజబాబు తమ్ముడు బాబి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రాజబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజబాబు 590 చిత్రాల్లో నటించి అందరి హృదయాల్లో చిరస్థాయిగానిలిచిపోయారన్నారు. రాజబాబు మేనల్లుడు బీఎస్ఎన్ఎల్ వాసు, వెంకటేశ్వరరావు, పట్నాయక్, గణేష్, లక్ష్మీనారాయణ, మల్లు రవి పాల్గొన్నారు.


హాస్యనటుడు రాజబాబు విగ్రహం వద్ద జయంతి వేడుకలు దృశ్యం

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి


గండేపల్లి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి జాతీయరహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి సంబంధించి స్థానికుల కథనం మేరకు గండేపల్లికి చెందిన కాజులూరి రమణ(60) జాతీయ రహదారిపై ఎస్బీఐ బ్యాంకువద్ద రోడ్డు దాటుతుండగా వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన ఎస్ఐ యువీ శివనాగబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓ స్వామీ..నీ సేవ చేసే
భాగ్యం ఎవరిదో

అర్చకుల మధ్య ఆధిపత్య వివాదం

నివ్వెరపోయిన భక్తులు

పోలీసులకు ఫిర్యాదు


శ్రీచౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం

కొత్తపల్లి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీచౌడేశ్వరి సమేత రామలింగేశ్వస్వామి దేవాలయంలో స్వామికి సేవచేసే భాగ్యంపై ఇద్దరు అర్చకుల మధ్య వివాదం గ్రామంలో భక్తుల మధ్య మనోభావాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. భక్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ దేవాలయంలో గతంలో పనిచేసిన రమేష్ అనే అర్చకుడికి, ప్రస్తుతం పనిచేసే కప్పగంతుల రవితేజ అనే అర్చకుడికి మధ్య స్వామిచేసే భాగ్యంపై ఒకరికొకరు వివాదాలకు పోతున్నారు. ఈ ఇద్దరు గొడవలకు పోయి స్వామికి కైంకర్యాలు దూరమయ్యే రీతిలో గతంలో అర్చకుడిగా పనిచేసిన రమేష్ గుడికి తాళాలు వేసి వెంట తీసుకెళ్లారని భక్తులు ఆదివారం కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరికొద్దిరోజుల్లో కార్తీకమాసం ప్రారంభం కానున్నది. కార్తీకమాసం ప్రారం భం నాటికి ఈ వివాదాన్ని పరిష్కరించి స్వామికి యథారీతిలో పూజలు చేసుకునే భాగ్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. ఈ సమస్య పరిష్కారం నిమిత్తం దేవదాయ, ధర్మదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

దేశభక్తిని పెంపొందించడంలో భారత్ వికాస్ కృషి

ఆచార్య దోర్బల ప్రభాకరశర్మ

కొవ్వూరులో జాతీయస్థాయి బృందగాన పోటీలు

కొవ్వూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడిలో విద్యార్థి దశ నుంచి దేశభక్తిని పెంపొందించడానికి భారత్ వికాస్ పరిషత్ కృషి చేయడం అభినందనీయమని ఆచార్య దోర్బల ప్రభాకరశర్మ అన్నారు. ఆదివారం కొవ్వూరు పరిమి రామారాయుడు రత్తమ్మ కళ్యాణ మండపంలో డాక్టర్ రమేష్ యల్లాప్రగడ అధ్యక్షతన భారత్ వికాస్ పరిషత్ ప్రాంత జాతీయ బృందగాన పోటీలను నిర్వహించారు. హిందీ, తెలుగు, సంస్కృతం, జానపద గీతాల పోటీలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, డాక్టర్ కేఎస్ఎన్ మూర్తితో కలిసి ప్రభాకరశర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపర్క్, సహయోగ్, సంస్కార్, సేవ సమర్పణ్ పరమావిధిగా విద్యార్థుల్లో దేశభక్తి, సేవాతత్పరతను పెంపొందించడానికి భారత్ వికాస్ పరిషత్ 62 ఏళ్లుగా కృషి చేస్తోందన్నారు. ఈ పోటీల్లో హిందీ, సంస్కృత విభాగాల్లో 8 బృందాలు, తెలుగు, జానపద విభాగాల్లో 9 బృందాలు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి డీఏవీ స్కూల్ అనకాపల్లి, ద్వితీయ బహుమతి విశాఖ వ్యాలీ విశాఖపట్నం, తృతీయ బహుమతి శ్రీప్రకాష్ విద్యానికేతన్ పాయకరావుపేట, మోటివేషన్ బహుమతి డీవీఏ పాఠశాల కొవ్వూరు బృందాలు ఎంపికయ్యాయి. ప్రథమస్థానంలో నిలిచిన డీఏవీ స్కూల్ అనకాపల్లి బృందం హిందీ, సంస్కృత విభాగంలో సౌత్ విభాగం హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.


జాతీయ బృందగాన పోటీలలో పాల్గొన్న నాయకులు

ఈ పోటీల్లో విశాఖపట్నం, కొవ్వూరు, తుని, అనకాపల్లి, రాజమహేంద్రవరం, కుమారదేవంకు చెందిన విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి గేయాలు ఆలపించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ ప్రాంత అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు, జీవీవీ సుబ్రహ్మణ్యం, తాడోజు సాయికృష్ణ, సౌత్ రీజియన్ జనరల్ సెక్రటరీ పురుషోత్తమశాస్త్రి, రీజనల్ జాయింట్ సెక్రటరీ ఎంవీవీ సత్యనారాయణ, బి.సుబ్బారావు, భారత్ వికాస్ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్

కాకినాడ సిటీ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పశ్చిమ-తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్‌ని ఖరారు చేసినట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు అలాగే కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎంపిక చేశారు.

రాజానగరంలో విద్యుత్ హైవోల్టేజ్ సరఫరా

గృహోపకరణాలు దగ్ధం

రూ.10 లక్షలు మేర ఆస్తి నష్టం

పట్టించుకోని విద్యుత్‌శాఖాధికారులు

గగ్గోలు పెడుతున్న వినియోగదారులు

రాజానగరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు తీవ్రమైన నష్టం వాటిల్లిందని రాజానగరంలోని వైఎస్సార్ జంక్షన్ సమీపంలోని నివాసితులు వాపోతున్నారు. తమ ప్రాంతంలో రెండు రోజులుగా విద్యుత్ సరఫరాలో లోపాలు తలెత్తుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తమ ప్రాంతంలో విద్యుత్ హెచ్చుతగ్గులు రావడంతో దాదాపు 15కుటుంబాలకు సంబంధించిన టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, కూలర్లు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, కంప్యూ టర్లు, ల్యాప్‌లాప్‌లు, పరుపులు తదితర విలువైన గృహోపక రణాలు దగ్ధం కావడంతో సుమారు రూ.10లక్షలు మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు చెప్పారు. గత 20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని ఇంతవరకు ఇటువంటి పరిస్థితులు చూడలేదన్నారు. సుమారు 50సార్లుగా అప్పటికప్పుడే హైవోల్టేజీ, వెంటనే లోవోల్టేజీ రావడం వల్లనే ఈ ఇబ్బందులు తలెత్తినట్లు బాధితులు రాయుడు విజయ భారతి, గోకా దేవి, నీలపాల వీర్రాజు, మంద సత్తిబాబు, ప్రగడ సుబ్బారావు తెలిపారు. ఈవిషయమై రాజానగరం విద్యుత్ శాఖ ఏఈ సుధాకర్‌ను వివరణ కోరగా ప్రమాదం జరిగినమాట వాస్తవమే అయితే ఆ ప్రాంతంలో కొంతమంది ఇళ్లకు ఎర్తులు సక్రమంగా లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని బదులిచ్చారు.


హై ఓల్టేజీతో దగ్ధమైన విలువైన గృహోపకరణాలు

పాదగయ క్షేత్రంలో
కాంట్రాక్టు లెక్చరర్ల హోమం, పొర్లుదండాలు

పిఠాపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో తమను రెగ్యులరైజ్ చేయాలంటూ ఆదివారం గణపతి హోమం నిర్వహించారు. అర్థాంతరంగా నిలిచిపోయిన క్రమబద్దీకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి కావాలని కోరుకుంటూ పురుహూతికాఅమ్మవారికి లెక్చరర్లు పొర్లుదండాలు పెట్టారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జోక్యం చేసుకుని తమను రెగ్యులరైజ్ చేయడం ద్వారా నాలుగు వేల కుటుంబాల్లో వెలుగులు నింపాలని వారు విన్నవించారు. కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన దశలవారీ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పిఠాపురం, మంగళగిరి, కుప్పంలో గణపతిహోమాలు నిర్వహించినట్లు గవర్నమెంట్ కాలేజీల కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ఆర్ శర్మ, ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ, వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్‌లు తెలిపారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని వారు కోరారు. కార్యక్రమాల్లో ఉమ్మడి ఉభయగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలుతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టు లెక్చరర్లు పాల్గొన్నారు.


పిఠాపురం పాదగయ క్షేత్రంలో పురుహూతికాఅమ్మవారికి పొర్లుదండాలు పెడుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

గిరిజన పసిబిడ్డల ఆరోగ్యానికి రక్షణేది?

డోలీ మోతలే కాదు... పసిబిడ్డల మరణాలూ ఉండొద్దు

ముఖ్యమంత్రి ఎంత చెబుతున్నా మారని వైద్యసేవల తీరు


మృతిచెందిన పసిబిడ్డతో తల్లి (ఫైల్)

(రంపచోడవరం-ఆంధ్రజ్యోతి)

మన్యంలో అసలు డోలీ మోతలు, వైద్యసేవల నిర్లక్ష్యం ఉండొద్దంటూ ఏకంగా కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంత ఏకరవుపెట్టినా ఇక్కడ పరిస్థితులు ఏమీ మారడంలేదు. డోలీ మోతలు నిరోధించడం ఇప్పటి కిప్పుడు సాధ్యం కాకపోవచ్చు, కానీ సకాలంలో ఆసుపత్రు లకు చేరుకున్నా మెరుగైన వైద్యాన్ని పొందలేని దుస్థితిని అల్లూరి మన్యంలోని రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రులలో వైద్యులకు కొదవలేకపోయినా, పరిపాలనా వైఫల్యాలతో వారి సేవలకు కొదవ ఏర్పడుతోంది.

మొక్కుబడి వైద్యం

వై.రామవరం మండలం గుర్తేడు పంచాయతీలోని జి.కొత్తూరు గ్రామానికి చెందిన పావని అనే తన మూడు నెలల పసిబిడ్డను తీసుకుని గొలారి దాలిమ అనే మహిళ బుధవారం గుర్తేడు పీహెచ్‌సీకి తీసుకువస్తే, అక్కడ ఏదో మొక్కుబడిగా చూసి అందుబాటులో ఉన్న మందులను ఇచ్చి ఇంటికి పంపించేయగా, అదేరోజు రాత్రి ఆ పసిబిడ్డ మృతి చెందింది. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పసిపిల్లల కోసం 24 గంటలూ పనిచేసే ఓ విభాగం నడుస్తోందని తెలిసీ కూడా ఆ పసి బిడ్డను మెరుగైన వైద్యం కోసం ఇక్కడకు రిఫర్ చేయకుండా ఆబిడ్డ మరణానికి గుర్తేడు వైద్యులు, సిబ్బంది పరోక్షంగా కారణమయ్యారు.

ప్రాణాపాయస్థితిలో పసిబిడ్డలు

ఇదిలావుండగా అదే గుర్తేడుకు చెందిన కడబాల లింగారెడ్డికి చెందిన పసిబిడ్డను కూడా మూడురోజుల క్రితం అనారోగ్యంతో గుర్తేడు పీహెచ్‌సీకి చేర్పితేపై మాదిరిగానే తోచిన వైద్యంచేసి ఇంటికి పంపించేశారు. ఆ బాలుడి ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఓ ఆశా వర్కర్ సూచనతో తల్లిదండ్రులు రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా తోచిన వైద్యం చేసి రాజమండ్రికి తరలించారు. అక్కడ కూడా ఇదే తంతు జరిగి, కాకినాడ ఆసుపత్రికి తరలించారు. ఇపుడు అక్కడ ఆ బిడ్డ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు.

అలంకారంగానే ఆరోగ్య కేంద్రం

ఈ రెండు ఘటనలపై గుర్తేడు సర్పంచ్ దుష్యంతుడు తీవ్రంగా స్పందించారు. తమ గుర్తేడులో ఆరోగ్య కేంద్రం కేవలం అలంకారంగానే మారిందని, పేరుకు మాత్రమే ముగ్గురు వైద్యులు ఉంటారని, వారి సేవలు ఎప్పుడు తవకు అందుబాటులో ఉంటాయో వారికే తెలియదని, ఈ ఘటనలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయనున్నట్టు కూడా ఆయన తెలిపారు.ఇవి కేవలం వెలుగులోకి వచ్చినవి మాత్రమే! వెలుగులోకి రాకుండా ఎన్నో పసిబిడ్డల మరణాలు మన్యం నిండా చోటు చేసుకుంటున్నా, మంచి ప్రభుత్వం వచ్చిందన్న ఆశలను అడియాశలను చేస్తూ వైద్య సేవలను ఎటువంటి మౌళిక సదుపాయాలు లేని రోజులకంటే దయనీయ స్థితికి దిగజార్చుతున్నారు.

రత్నగిరిపై సర్వర్‌లు పనిచేయక నిలిచిన సత్రం గదుల కేటాయింపు

అన్నవరం, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి సర్వర్‌లు పనిచేయక సత్రం గదులు కేటాయింపు నిల్చిపోయాయి. ఒక పక్క పెళ్లిల్లు ఉంటం మరోక పక్క సత్యదేవుని దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. కేవలం రిజర్వేషన్ చేసుకొన్న ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న భక్తులకు గదులు కేటాయించారు. మిగతావారు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మధ్యాహ్నం మూడున్నర నుంచి రాత్రి 7.30 వరకు ఈసమస్య ఉత్పన్నమైయింది. తరువాత 8గంటల ప్రాంతంలో టెక్నికల్ సిబ్బంది దీన్ని పరిష్కరించిన తరువాత గదులు కేటాయింపు చేపట్టారు. అయితే ఇది అన్నవరం దేవస్థానం తప్పిదం కాదని, దీనికి సాఫ్ట్‌వేర్ వల్ల సమస్య వచ్చిందని అధికారులు తెలిపారు.

హెల్త్ సెక్రటరీల ప్రావిజినల్ సీనియారిటీ లిస్ట్ విడుదల

కాకినాడ క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీల ప్రావిజినల్ సీనియారిటీ లిస్ట్ విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల్లో పనిచేస్తున్న గ్రామ,వార్డు హెల్త్ సెక్రటరీల సీనియారిటీ లిస్ట్ తయారు చేయాల్సిందిగా మంగళగిరి ప్రధాన కార్యాలయంనుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. మా వద్ద ఉన్న సమాచారం నవీకరణ చేసి సంబంధిత పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, పీపీ యూనిట్లు మున్సిపల్ కమిషనర్లు, రంపచోడవరం పీవో వారికి ప్రావిజినల్ సీనియారిటీ లిస్ట్ జతచేయడం జరిగిందన్నారు. ఈ లిస్ట్‌లను సంబంధిత అధికారులు పరిశీలించిన తర్వాత సమాచారం సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించాలని కోరారు. ఏమైనా మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు ఉంటే సోమవారం సాయంత్రం 4 గంటలలోపు నమోదు చేసుకోవాలని కోరారు.

సత్యదేవుడికి రథోత్సవం

అన్నవరం, అక్టోబరు 20: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జిత సేవయిన రథోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తోడ్కొని వచ్చి టేకురథంపై ఆసీనులు గావించి ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితులు మంత్రోచ్చరణల నడుమ తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షణ గావించారు. హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.


టేకురథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

వరద బాధితులకు ఆర్థికసాయం

తాళ్లపూడి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆదివారం మండలంలోని టాటా వాటర్ ప్లాంట్ తరఫున అరుణజ్యోతి బయో వెంచర్స్ మేనేజర్ మధు రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు పారిశ్రామికవేత్త జీవీ ప్రసాదు సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో యువ గళం నాయకులు కూచిపూడి గణేష్, తొండెపు భరత్‌కుమార్, కాంట్రాక్టర్ మేజ్జి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన అవసరం

» మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు వాసు, బత్తుల
» రాజమహేంద్రవరంలో పింక్ 5కే రన్



రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, ఓఎన్‌జీసీ ఈడీ శంతనుదాస్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 20 (ఆం ధ్రజ్యోతి): రొమ్ము కేన్సర్‌పై మహిళలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కం దుల దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ అన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా జీఎస్ఎల్ ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం పింక్ 5కే రన్ నిర్వహించారు. ఆదివారం స్థానిక పుష్కరాల రేవు వద్ద ఈ రన్ ప్రారంభ కార్యక్రమానికి మంత్రి దుర్గేష్,ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంతను దాస్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, బత్తుల విచ్చేశారు. ఈ రన్ పుష్కర ఘాట్ వద్ద నుంచి ప్రారంభమై గోదావరి బండ్, స్టేడియం రోడ్డు, జాంపేట, కోటగుమ్మం మీదుగా తిరిగి పుష్కరాల రేవు వద్దకు చేరుకుంది. ఈ రన్‌లో సుమారు 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన చెల్లుబోయిన వెంకటప్రదీప్, కిలపర్తి భాస్కర్, ముదిలి శరత్ చంద్రప్రసాద్‌కు నగదు బహుమతులను అందజేశారు. విజేతలు ముగ్గురూ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులే. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల జీఎస్ఎల్ కేన్సర్ హాస్పిటల్ ప్రస్థానాన్ని ప్రస్తావించి ప్రజలకు డాక్టర్ గన్ని భాస్కరరావు, ఆయన బృందం అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ కొన్నేళ్లుగా రొమ్ము కేన్సర్ కేసులు ఎక్కువవుతు న్నాయని వాటిపై అవగాహన కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గన్ని భాస్కరరావు మాట్లాడుతూ కేన్సర్‌ను ముందే గుర్తిస్తే అంత సురక్షితంగా కోలుకునే అవకాశం వుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత గన్ని కృష్ణ, జీఎస్ఎల్ కేన్సర్ హాస్పిటల్ డైరెక్టర్, సర్జికల్ ఆంకాలజీస్ట్ డాక్టర్ తరుణ్ గోగినేనితో పాటు వివిధ రంగాల ప్రముఖులు, జీఎస్ఎల్ విద్యాసంస్థల, ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమితో గ్రామాల ప్రగతికి బాటలు

» ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి » పలుచోట్ల పల్లె పండుగ కార్యక్రమాలు


అనపర్తి: కుతుకులూరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి/బిక్కవోలు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల ప్రగతికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం అనపర్తి మండలం పులగుర్త, కుతుకులూరు, పొలమూరు, బిక్కవోలు మండలం తొస్సిపూడి, పందలపాక, ఊలపల్లి, బిక్కవోలు, ఇళ్లపల్లి, రంగాపురం, బలభద్రపురం, కాపవరం గ్రామాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పొలమూ రులో నిర్వహించిన సమావేశంలో ఆయన మా ట్లాడుతూ పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలో రూ.14 కోట్ల నిధులతో రోడ్లు నిర్మిస్తున్నామని, ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకర రెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, గొల్లు హేమతులసి, సబ్బారపు పద్మావతి, పడాల సూర్యనారాయణ రెడ్డి, తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, బండారు రమ్య, సరెళ్ల సుమలత తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి హాల్ట్‌కు కృషిలో పురోగతి

అనపర్తిలో జన్మభూమి సూపర్ ఫాస్ట్ రైలు హాల్ట్‌కు చేస్తున్న కృషిలో పురోగతి కనిపిస్తోందని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. జన్మభూమి సూపర్‌ఫాస్ట్ రైలు కావడంతో హాల్ట్ విషయాన్ని రైల్వే బోర్డుకు తెలియపరచినట్టు రైల్వే జనరల్ మేనేజర్ తమకు లిఖిత పూర్వకంగా తెలిపినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరలో హాల్టు సాధించే దిశగా ప్రయత్నం చేస్తున్నామన్నారు.

హైస్కూల్ ప్లస్ తరగతులను వేరు చేయాలి

ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ త్రినాథబాబు

దివాన్‌చెరువు, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల నుంచి హైస్కూల్ ప్లస్ తరగతులను వేరు చేసి జడ్పీ జూనియర్ కళాశాలలుగా గుర్తించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు అన్నారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జీవో 117 రద్దుకు సిద్ధపడడం హర్షణీయమన్నారు. ఈ ఉత్తర్వులు అమలు చేయడం ద్వారా ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. అలాగే ఏకోపాధ్యాయ పాఠశాలలు సంఖ్య కూడా మన రాష్ట్రంలో బాగా అధికమైందన్నారు. ఈ క్రమంలో జీవో 117 రద్దుకు ప్రభుత్వం సంసిద్ధత తెలపడంతో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో చేపట్టవలసిన ప్రత్యామ్నాయ ప్రతిపాదనలపై ఎస్టీయూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు లేఖ రాసిందని చెప్పారు. వాటిని పరిగణలోనికి తీసుకుని ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని త్రినాథబాబు కోరారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ


చెరువులో గంబూషియా చేపలు వదులుతున్న దృశ్యం

కడియం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు గంబూషియా చేపలు తోడ్పడతాయని కడియపులంక పీహెచ్‌సీ డాక్టర్ జెస్సీ సుప్రియ అన్నారు. దోమల లార్వా నిర్మూలనలో భాగంగా కడియం మత్స్యశాఖ ఇచ్చిన గంబూషియా చేపలను పీహెచ్‌సీ పరిధిలోని వెంకయ్యమ్మపేటలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వదిలినట్టు చెప్పారు. దోమలు పెట్టిన లార్వాను ఈ చేపలు తింటాయని తద్వారా దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది జె.హనోక్, శ్రీనివాస్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు రక్షణ చట్టం చేయాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి నూకాలమ్మ


కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 20: బీసీలకు రక్షణ చట్టం చేయాలని, కులగణన చేపట్టాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి వైనూకాలమ్మ, సంఘం జాతీయ కన్వీనర్ వైనాగేశ్వరరావు కోరారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం, ఆ దిశగా కృషి సాగిస్తోందని, ఇది శుభపరిణామమని వారు పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి అధ్యక్షుడు లద్దిక మల్లేష్ మాతృమూర్తి మృతి నేపథ్యంలో స్థానిక గంటాలమ్మ గుడి వద్ద ఉన్న మల్లేష్ ఇంటికి విచ్చేసిన నూకాలమ్మ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, బీసీల తరఫున 40 మంది ఎమ్మెల్యేలు, 9 మంది మంత్రులయ్యారని, 9 మంది పార్లమెంటుకు వెళ్లారని గుర్తుచేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల హామీ మేరకు బీసీలకు రక్షణ చట్టం తీసుకురావడానికి ఇప్పటికే మీటింగ్ ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకుడు కేకే సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

26నుంచి ఆధ్యాత్మిక యాత్ర

» ఆరు పుణ్యక్షేత్రాలను కలుపుతూ బస్సు ఏర్పాటు
» పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వారాంతంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించే విధంగా ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక దేవాలయాలు, పంచారామక్షేత్రాలు సందర్శించేలా ఒక రోజు టూర్ ప్యాకేజీకి పర్యాటక శాఖ సన్నాహాలు చేస్తోందన్నారు. అసెంబ్లీలో శాసనసభ్యుల సూచనల మేరకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. యాత్ర కోసం బస్సును ఏర్పాటు చేశామని, దానిలో 18 సీట్లు ఉంటాయన్నారు. ఈ బస్సు కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామం, వాడపల్లి ఆలయాలను కలుపుతూ రూట్ నిర్ధారించామన్నారు. బస్సును రాజమహేంద్రవరం సరస్వతి ఘాట్ వద్ద టూరిజం శాఖకు సంబంధించిన సమాచారం, రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం వద్ద ఈనెల 26న ఉదయం 6గంటలకు ప్రారంభిస్తామన్నారు. ఉదయం బయలుదేరి యాత్ర పూర్తి చేసుకుని రాత్రి 7:30గంటలకు తిరిగి రాజమహేంద్రవరం చేరుకుంటుందన్నారు. బస్సు టిక్కెట్ పెద్దలకు రూ.వెయ్యి, 3-10 ఏళ్ల చిన్నారులకు రూ.800గా నిర్ణయించారన్నారు. ప్రకృతి రమణీయత, ఆధ్యాత్మిక కలయికగా ఉన్న ఈ టూర్ ప్యాకేజీని యాత్రికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. 26న ప్రారంభోత్సవంలో తాను, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, టూరిజం శాఖ ఉన్నతాధికారులు, బోర్డు డైరెక్టర్లు పాల్గొంటారని తెలిపారు.

సీపీరెడ్డి నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి

కర్నాకుల వీరాంజనేయులు



సింగంపల్లిలో ఆందోళన నిర్వహిస్తున్న రైతుకూలీ సంఘ సభ్యులు

రంగంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగంపల్లిలో సీపీరెడ్డి నగర్ కాలనీలో నివాసముంటున్న ప్రజలకు పట్టాలు మంజూరు చేసి, సీసీ రోడ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ 30ఏళ్లగా ఇల్లు లేని పేదలు సీపీరెడ్డి నగర్‌లో ఇల్లు కట్టుకొని జీవిస్తున్నారని వీరికి రోడ్లు, డ్రైనేజీలు వంటి సౌకర్యాలు లేక వర్షం కురిస్తే కాలనీ నీటితో మునిగి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆ ప్రాంతవాసులకు నివాస పట్టాలు మంజూరు చేసి, పక్కా ఇల్లు నిర్మించి, రోడ్లు, డ్రైనేజీ, వ్యక్తిగత మరుగుదొడ్డి వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, జిల్లా నాయకులు మడికి సత్యం, ఎల్లే సత్తిబాబు, పారిశుధ్య కార్మికుల సమాఖ్య కన్వీనర్ బొచ్చ యేసు, ఏఐఎస్టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, చెక్క సత్తిబాబు, ఎం.గోవింద్, తలుపులమ్మ పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్ ఓపెన్‌సైట్ కేటగిరిలో విజేతలు వీరే..

దివాన్‌చెరువు, అక్టోబరు 20: అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ పోటీలలో ఓపెన్‌సైట్ విభాగంలో విజేతల వివరాలను జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి ఆదివారం ప్రకటించారు. సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో జరుగుతున్న ఈ పోటీల్లో.. అండర్-14 బాలికల విభాగంలో కర్నూలు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, అనంతపురం జిల్లా జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి. అండర్-14 బాలురు విభాగంలో పశ్చిమగోదావరి, కర్నూలు, అనంతపురం జిల్లాల జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. అండర్-17 బాలికల విభాగంలో వైఎస్ఆర్ కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి. అండర్-17 బాలురు విభాగంలో కర్నూలు, తూర్పుగోదావరి, అనంతపురం జిల్లాల జట్లు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. అండర్ 19 బాలికల విభాగంలో వైఎస్ఆర్ కడప, అనంతపురం, కృష్ణా జిల్లాల జట్లు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. అండర్-19 బాలుర విభాగంలో అనంతపురం జిల్లా జట్టు మొదటి బహుమతిని, వైఎస్ఆర్ కడప జిల్లా జట్టు రెండో బహుమతిని, చిత్తూరు జిల్లా జట్టు మూడో బహుమతి సాధించాయని స్వామి తెలిపారు. వీరికి ఉపవిద్యాశాఖాధికారి నారాయణ, రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ టి.స్వరూప్‌రెడ్డి తదితరులు బహుమతులు అందజేశారు.

ఆటోకన్సల్టెన్సీ ఫైనాన్షియర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ది రాజమండ్రి ఆటోకన్సల్టెన్సీ ఫైనాన్షియర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాజమహేంద్రవరం గంటా గనిరాజు కళ్యాణ మండపంలో జరిగిన సమావేశానికి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు నీలి నాగబాబు, ఇన్నమూరి దీప్, సూరంపూడి పోలరాజు, మరుకుర్తి రవి యాదవ్, చప్పిడి శ్రీనివాస్, గౌరవ సలహాదారులు జక్కంపూడి డానియేల్ విచ్చేవారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవం చేశారు. నూతన అధ్యక్షుడిగా కర్రి శేఖర్, వైస్ ప్రెసిడెంట్‌గా ఏలూరి సురేష్, సెక్రటరీగా శీర్ల బ్రహ్మానందం, జాయింట్ సెక్రటరీగా పడాల సత్తిబాబు, కోశాధికారిగా రవి చంద్రశేఖర్‌జైన్, మరో ఏడుగురు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి గౌరవాధ్యక్షుడు, సలహాదారులు అభినందనలు తెలిపారు.

సినీ హాస్యనటుడు రాజబాబు జయంతి


కోరుకొండలో రాజబాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కోరుకొండ, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): సినీ హాస్యనటుడు రాజబాబు జయంతి కార్యక్రమాన్ని ఆదివారం కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్ వద్ద ఘనంగా నిర్వహించారు. విద్యాకమిటీ ఛైర్మన్ తెలగంశెట్టి శివ, సభ్యులు రాజబాబు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజబాబు సినీ రంగంలోనే కాకుండా సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి అని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ వైస్ ఛైర్మన్ రాజేశ్వరి, సభ్యులు భూపతిరావు, ఎనాగేశ్వరరావు, రవి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సంగీత విభావరి


సినీ సంగీత విభావరిలో పాల్గొన్న ప్రముఖులు

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం లో శోభన్‌బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన స్వర ప్రభంజనంలో వర్ధమాన గాయనీమణి కోరుకొండ ప్రభ 116 పాటలు పాడి సినీ సంగీత అభిమానులను అలరించింది. గతంలో 50 పాటలు పాడి అర్ధశత గాన ప్రభ, 75 సినీ గీతాలు పాడి వజ్రామృత గాన ప్రభ బిరుదు పొందిన ప్రభ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 116 పాటలతో సినీ సంగీత విభావరి రికార్డుల్లోకి ఎక్కిందని నిర్వాహకుడు దొండపాటి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గాయనీగాయకులు తమ గళాన్ని వినిపించారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ పూర్వ అధ్యక్షుడు పీవీఎస్ కృష్ణారావు, అల్లు బాబి, రాకా అధ్యక్షుడు కంటే వీరన్నచౌదరి, జీవీ రమణ, పతివాడ రామరాజు, ఎరక కొండబాబు, గుబ్బల రాంబాబు, బళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలను మెడికల్ అండ్ హెల్త్‌లో విలీనం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను (యూపీహెచ్‌సీ) నేషనల్ హెల్త్ మిషన్ నుంచి మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్‌లో విలీనం చేయాలని యూపీహెచ్‌సీ యూనియన్ జిల్లా నాయకులు కేపీ నాయుడు, జేవీవీ సత్యనారాయణ కోరారు. ఆదివారం రాజమహేంద్రవరం వై జంక్షన్‌లోని హెల్త్ సెంటర్‌లో యూపీహెచ్‌సీ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యూపీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలనే సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా యూపీహెచ్‌సీ ఎంప్లాయీస్ యూనియన్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా బి.పవన్, జిల్లా అధ్యక్షురాలిగా వి.వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా అనిత, వెంకట్, కాశి, నరేష్, కోశాధికారిగా జీటీపీ కుమార్, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

బాలలకు సృజనాత్మకతపై శిక్షణ



బాలలకు ఆకృతులు తయారుచేయడం నేర్పిస్తున్న టీచర్

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి వారం బాల మందిరం కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఓరిగామి శిక్షణ తరగతులను క్రాఫ్ట్ టీచర్ సత్యవేణి నిర్వహించారు. శిక్షణలో బాలలు పాల్గొని సృజనాత్మకతతో కాగితంతో అనేక అకృతులను, ఫొటోఫ్రేమ్, ఫ్లవర్‌వాజ్, పక్షులు, జంతువుల చిత్రాలు వంటివి ప్రదర్శించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆర్ఎస్ఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీ వ్యవస్థాపకుడు శ్రీరంకిరెడ్డి సుబ్బరాజు సమకూర్చిన బహుమతులను నిర్వాహకులు అందజేశారు. బాలల సభలో కథలు చదవడం, కథలు చెప్పడం బాలసాహిత్యం పుస్తక సమీక్షలు, ఇన్‌డోర్ గేమ్స్‌లో బాలలు చురుగ్గా పాల్గొన్నారు. క్రాఫ్ట్ టీచర్ సత్యవేణి విద్యార్థులు సత్కరించారు. సుబ్బరాజు జన్మదినోత్సవం సందర్భంగా ఆయన చేస్తున్న విద్యా సేవలను నిర్వాహకులు విద్యార్థులకు వివరించారు.

స్కూటీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

» ఇద్దరు నన్నయ యూనివర్శిటీ పీజీ విద్యార్థినులకు గాయాలు
» చికిత్స పొందుతూ ఒకరి మృతి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 20: రాజమహేంద్రవరం లాలాచెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నన్నయ విశ్వవిద్యాలయంలో పీజీ మూడో సంవత్సరం చదువుతున్న కుంచె పల్లవి(22) మృతిచెందింది. ఈనెల 19వ తేదీ ఉదయం రాజమహేంద్రవరం రూరల్ హుక్కుంపేట వరలక్ష్మికాలనీకి చెందిన కుంచె పల్లవిని కళాశాలకు తీసుకువెళ్లేందుకు ఆమె తండ్రి యేసురత్నం తన బైక్‌పై లాలాచెరువు వద్ద దింపారు. లాలాచెరువు సెంటర్ నుంచి బస్సులో నన్నయ యూనివర్శిటీకి వెళ్లేందుకు పల్లవి వేచి వుంది. ఆ సమయంలో ఆమె స్నేహితురాలు బర్మా కాలనీకి చెందిన సంపంగి మృదులా స్కూటీపై వచ్చి పల్లవిని ఎక్కించుకుని ఇద్దరు యూనివర్శిటీకి బయలుదేరారు. ఈ క్రమంలో రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళ్తున్న ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు వీరి పక్క నుంచి వేగంగా రాసుకుని వెళ్లింది. దీంతో పల్లవి బ్యాగ్ బస్సు వెనుక ఉన్న నిచ్చెనకు చిక్కుకుపోయింది. దీంతో పల్లవిని బస్సు ఈడ్చుకుంటూ వెళ్లడంతో బస్సు చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంలో పల్లవి స్నేహితురాలు మృదుల స్వల్పంగా గాయపడింది. దీంతో వారిని స్థానికులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో పల్లవి ఆదివారం మృతి చెందింది. కాగా యేసురత్నం, శిరోమణి దంపతులకు ముగ్గురు కుమార్తెలు కాగా పల్లవి పెద్దకుమార్తె. ఆయన ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసుకుంటూ పిల్లల్ని చదివించుకుంటున్నాడు. కుమార్తె మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. బస్సు డ్రైవర్‌ను బొమ్మూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు సీఐ కాశీ విశ్వనాథం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

తాళ్లపూడి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ప్రక్కిలంక సర్పంచ్ యాళ్ల స్వప్నతో కలిసి సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయుడు హనుమంతరావు, జీవీ ప్రసాదు, వేణుమాధవి, యాళ్ల బాబూరావు, ఎంపీడీవో రమణ, డీఈ శ్రీనివాసరావు, ఏఈ త్రిమూర్తులు, ఏపీవో రమాదేవి పాల్గొన్నారు. అనంతరం పెద్దేవంలో ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ఎన్ఆర్‌జీఎస్ నిధులతో చేపట్టే పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, కోడి శంకరం పాల్గొన్నారు. తిరుగుడుమెట్టలో బీసీ, ఓసీ ఏరియాల్లో ఎన్ఆర్‌జీఎస్ నిధులతో పలు రోడ్లకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.

కొవ్వూరు: కొవ్వూరు మండలంలోని దేచర్ల గ్రామంలో అంతర్గత సీసీ రోడ్డు పనులకు, కుమారదేవం గ్రామంలోని హౌసింగ్ లేఅవుట్‌లో రోడ్డు పనులకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ప్రారంభించారు.

రోగులకు పండ్లు పంపిణీ



కడియం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వెలుగుబంటి యూత్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కడియం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంచారు. బొర్సు సురేష్ సమకూర్చిన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వెలుగుబంటి యూత్ మాట్లాడుతూ టీడీపీ మండలాధ్యక్షుడు, కడియం ఉపసర్పంచ్ వెలుగుబంటి రఘురామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాలు చేసినట్టు చెప్పారు.

ఏకం ఆధ్యాత్మిక జాగృతి



రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సూర్యహోటల్‌లో ఆదివారం ఏకం ఆధ్యాత్మిక జాగృతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏకం దాసాజీ ఆప్తి దైనందిన జీవితంలో ఒత్తిడిని తగ్గించుకోవడానికి, శారీరక వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవడానికి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో అనేక మంది పాల్గొన్నారు.


దేశభక్తిని పెంపొందించడంలో భారత్ వికాస్ కృషి

కొవ్వూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించడానికి భారత్ వికాస్ పరిషత్ కృషి చేయడం అభినందనీయమని ఆచార్య దోర్బల ప్రభాకరశర్మ అన్నారు. ఆదివారం కొవ్వూరు పరిమి రామారాయుడు రత్తమ్మ కల్యాణ మండపంలో డాక్టర్ రమేష్ యల్లాప్రగడ అధ్యక్షతన భారత్ వికాస్ పరిషత్ ప్రాంత జాతీయ బృందగాన పోటీలను నిర్వహించారు. హిందీ, తెలుగు, సంస్కృతం, జానపద గీతాల పోటీలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, డాక్టర్ కేఎస్ఎన్ మూర్తితో కలిసి ప్రభాకరశర్మ ప్రారంభించారు. ఈ పోటీల్లో హిందీ, సంస్కృత విభాగాల్లో 8 బృందాలు, తెలుగు, జానపద విభాగాల్లో 9 బృం దాలు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి డీఏవీ స్కూల్ అనకాపల్లి, ద్వితీయ బహుమతి విశాఖ వ్యాలీ విశాఖపట్నం, తృతీయ బహుమతి శ్రీప్రకాష్ విద్యానికేతన్ పాయకరావుపేట, మోటివేషన్ బహుమతి డీఏవీ పాఠశాల కొవ్వూరు బృందాలు ఎంపికయ్యాయి. ప్రథమస్థానంలో నిలిచిన డీఏవీ స్కూల్ అనకాపల్లి బృందం హిందీ, సంస్కృత విభాగంలో సౌత్ విభాగం హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో విశాఖ, కొవ్వూరు, తుని, అనకాపల్లి, రాజమహేంద్రవరం, కుమారదేవంకు చెందిన విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి గేయాలు ఆలపించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ ప్రాంత అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు, జీబీవీ సుబ్రహ్మణ్యం, తాడోజు సాయికృష్ణ, సౌత్ రీజియన్ జనరల్ సెక్రటరీ పురుషోత్తమ శాస్త్రి, రీజనల్ జాయింట్ సెక్రటరీ ఎంవీవీ సత్యనారాయణ, బి.సుబ్బారావు, భారత్ వికాస్ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో అనన్యకు రెండో స్థానం


షీల్డ్ అందుకుంటున్న అనన్య

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలో జరిగిన అండర్-9 బాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన చింతా అనన్య రెండో స్థానం సాధించింది. డిసెంబరులో పూణేలో జరుగనున్న జాతీయ పోటీల్లో మన రాష్ట్రం తరుపున అనన్య ప్రాతినిధ్యం వహిస్తుందని జిల్లా చదరంగం సంఘం అధ్యక్షుడు జీవీ కుమార్ తెలిపారు. ఎంకె అకాడమీ కోచ్‌లు జి.కార్తీకగోపాల్, జి.హేమచంద్రమౌళిలతో ట్రైనింగ్ పొందుతోందని అనన్య తల్లిదండ్రులు తెలిపారు.





కోనసీమ తిరుమల వాడపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు వైఖానస ఆగమం ప్రకారం జరగనున్నాయి.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కోట సత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

నిడదవోలు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోట సత్తెమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, ధూప హారతి, నిత్యార్చన, లలితా పారాయణ, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహా నివేదన సమర్పించారు. ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావ డంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.35,920, అన్నదాన విరాళాల ద్వారా రూ.3,517, ప్రసాద విక్రయాల ద్వారా రూ.40,265, పూజ, ఇతర టికెట్ల ద్వారా రూ.70,118... మొత్తం రూ.1,49,820 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్-చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.



ఆనబకాయ @ 40

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సాంబారులోకే కదా అంటూ ఆనబకాయను చాలా మంది చులకనగా తీసి పారేస్తుంటారు. అందుకు తగ్గట్టే ధర కూడా ఏనాడూ రూ.10 మించింది లేదు. మహా అయితే రూ.15 పలికేది. అదే పెద్ద ధరగా, గొప్పగా భావించేవారు. కానీ ప్రతి దానికీ ఏదో ఒకరోజు వస్తుందని పెద్దలు చెప్పినట్టే ఇప్పుడు ఆనబకాయకు రోజు వచ్చింది. మంచి ధర పలుకుతోంది. మహా మహా డిమాండ్ కలిగిన వంకాయలు, బీరకాయలు, బెండకాయలతోపోటీపడుతూ ఆనబకాయ ధర ఎగబాకుతోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కొంచెం లేతగా ఉండే మీడియం సైజు ఆనబకాయ ఒక్కటి రూ.40 పలుకుతుండడం గమనార్హం. రైతు బజార్లలో మాత్రం రూ.30-32 ఉంది. సీతానగరం మండలంలోని గోదావరి తీర ప్రాంతాల్లో ఈ ఆనబకాయలను ఎక్కువగా సాగు చేస్తుంటారు. అయితే కొద్ది రోజుల క్రితం ఎడతెరిపిలేకుండా వర్షాలు కురవడంతో ఆనబపాదులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాదులు కుళ్లిపోవడంతో వాటిని తొలగించి మళ్లీ కొత్తగా నారు వేశారు. ఇప్పుడిప్పుడే కాపునకు వస్తున్నాయి. దీంతో వీటికి రేటు బ్రహ్మాండంగా ఉంది. కొన్నాళ్ల క్రితం వరకు ఐదు, పది రూపాయలు పెడితే ఆనబకాయ దొరికేది. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారింది. ఆనబకాయకూ మంచి ధర లభిస్తోంది. దీంతో ఆనబసాగు చేసే రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



గోదావరి గట్టున హాస్య నటుడు రాజబాబు జయంతి

- 8లో

రాజానగరంలో హైవోల్టేజ్ విద్యుత్ సరఫరా

గృహోపకరణాలు దగ్ధం

రూ.10 లక్షలు మేర ఆస్తి నష్టం

- 8లో

రెవెన్యూ శాఖలో ఏళ్ల తరబడి వేలాడుతున్న గ్రామ స్థాయి అవినీతి గబ్బిలాలు ఏకంగా మండల స్థాయి అధికారిని సైతం శాసించే స్థాయికి ఎదిగిపోయాయి. కలెక్టరేట్‌నీ గుప్పిట్లో పెట్టుకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అవకతవకలను బయటకు తీయాలని ప్రయత్నించే అధికారులను రాత్రికి రాత్రే బదిలీ చేయిస్తున్నారంటే అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుందో అర్థం చేసుకోవచ్చు. అసైన్డ్ భూముల్లో అవినీతి, మాజీ సైనికుల పేరుతో భూములను స్వాహా చేయడం, ఉద్దేశపూర్వంగా తప్పులు చేసి రైతుల దగ్గర నుంచి డబ్బులు గుంజడం.... ఇలా ఒకటేమిటి అన్నీ అక్రమాలే జరుగుతున్నాయంటూ జనం నుంచి వినిపిస్తున్న ఆరోపణలే. ఈ విషయం ఊరంతా తెలిసినా ఉన్నతాధికారులకు కానరాకపోవడం విస్మయం కలిగించే అంశం. అవినీతితో జేబులు నింపుకునే కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ ఇంటి దొంగలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపణలు హల్‌చల్ చేస్తున్నాయి. విజిలెన్స్ రంగంలోకి దిగినా అక్రమాలను వెలికి తీయడానికి దీర్ఘకాలం పట్టేలా వుంది. గోకవరం తహసీల్దారు కార్యాలయంలో తారస్థాయికి చేరిన అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' కథనం....

అవినీతి గబ్బిలాలు



అక్రమాలకు అడ్డాగా గోకవరం తహసీల్దారు కార్యాలయం

- అధికారులపై 'కింది స్థాయి వారిదే' పైచేయి
- తీవ్ర ఆరోపణలున్నా చర్యలు శూన్యం
- అవకతవకలపై ఉన్నతాధికారులూ మౌనం
- మాటిమాటికీ తహసీల్దార్ల బదిలీ(ల)లు
- అక్రమాలకు అడ్డుకట్ట వేసే క్రమంలో వారే బలి

గోకవరం (ఆంధ్రజ్యోతి)

గోకవరం తహసీల్దారుగా రావడానికి చాలా మంది జంకుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు కొనసాగిన అవినీతి తమకు చుట్టుకుంటుందేమో అనే మీమాంసతో కొందరు వెనకడుగు వేస్తున్నారు. ఇక్కడ తహసీల్దారుగా ఎవరు చార్జి తీసుకున్నా ఆ సంతకాల ఇంకు ఆరక ముందే బదిలీపై వెళ్లాల్సి వస్తోంది. మండలంలోని ఇద్దరు, ముగ్గురు గ్రామస్థాయి అధికారుల అక్రమాలకు అడ్డుకట్ట వేసే క్రమంలో చిత్రంగా వారే బలైపోతున్నారు. ఈ అవినీతిపరులపై చర్యలకు సిఫారసు చేసిన అధికారులు చిక్కుల్లో పడుతుండగా వీళ్ల మాత్రం కాలర్ ఎగరేసుకుని మరీ మరిన్ని అక్రమాలు చేస్తున్నారు. ఎన్నికల ముందు నాలుగు నెలల వ్యవధిలో ఏకంగా నలుగురు, ఐదుగురు తహసీల్దార్లు రోజుల వ్యవధిలో ఎందుకు బదిలీ అయ్యారో ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్న. ఓ మహిళా తహసీల్దారు చార్జి తీసుకున్నాక... మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలను ఉద్దేశపూర్వకంగా ఇబ్బందిపెడుతూ సొమ్ములు వసూలు చేస్తున్నారని, ఈ తతంగంలో కార్యాలయానికి కూడా పాత్ర ఉందని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. వెంటనే తహసీల్దారు కార్యాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు.

ఈ క్రమంలో ఇద్దరు వీఆర్ఏలను సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు, ముగ్గురు వీఆర్వోలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ నివేదిక సిద్ధం చేశారు. ఆ నివేదిక కలెక్టరుకు వెళ్లే కొద్ది గంటల ముందు పైరవీలు జరిగి లక్షలు చేతులు మారాయనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపించాయి. దీంతో అవినీతి అధికారులపై చర్యలకు ఉపక్రమించిన ఆ అధికారికి రాత్రికి రాత్రే బదిలీ ఉత్తర్వులు చేతికి అందాయి. దీంతో మండలం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కార్యాలయంలోని సీసీ కెమెరాలు మాయమయ్యాయి. దీనికి తోడు పలు అవినీతి ఆరోపణలపై ఆమెకు ముందు వెళ్లిన తహసీల్దారే మళ్లీ ఈ సీట్లోకి వచ్చారు. ఈ తంతులో సదరు గ్రామస్థాయి అధికారులు చక్రం తిప్పినట్టు చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంలో ఏజెన్సీలోని ఓ వైసీపీ నేత అండదండలతో మహిళా తహసీల్దారు నివేదిక బుట్టదాఖలు చేసి ఆ రెవెన్యూ అధికారులు సస్పెన్షన్ నుంచి తప్పించుకున్నట్టు ఆరోపణలు లేకపోలేదు. ఆ రెవెన్యూ అవినీతి తిమింగలాల్లో ఒకరు గతంలో సస్పెన్షన్‌కి గురికావడం గమనార్హం. ఇంత జరుగుతున్నా వీళ్లను అంగుళం కూడా కదిలించలేకపోతున్నారనే వాదన ఉంది. ఇప్పటికే వారు మండలంలోనే చక్కగా కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరో తహసీల్దారును తాజాగా సుమారు వారం క్రితం ఇక్కడి నుంచి ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చేశారు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దారు హవా కొనసాగుతోంది.

గోకవరం తహసీల్దారు కార్యాలయంలో పగలు కన్నా రాత్రి సమయంలోనే అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. అదేంటి బాధ్యతగానే ఉన్నారు కదా అనుకుంటే పప్పులో కాలిసినట్టే! అక్రమ పనులన్నీ ఆ సమయంలోనే పూర్తి చేసేస్తున్నారనే నింద గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులపై బలంగా ఉండేది. రాత్రి పది, పదకొండు గంటలైనా కార్యాలయంలో లైట్ల వెలుగులో వారికి నచ్చిన పనులను నచ్చినట్టు పూర్తి చేసి అవతల వ్యక్తులను సంతృప్తిపరిచే వారనే ప్రచారాన్ని గత అధికారులు మూటకట్టుకున్నారు. ఆ సమయంలో ఎవరైనా వెళ్తే... అధికారులు అర్జెంట్ పని చూసుకుంటున్నారని, ఉదయం రావాలని ఆరు బయటే ఓ వ్యక్తిని పెట్టుకొని సమాధానం చెప్పించేవారని అనుభవం ఎదుర్కొన్న పలువురు వ్యక్తులు చెప్పుకొస్తున్నారు. రాత్రివేళ పని ముగించుకొని ఇంటికి వెళ్తూ ఓ రెవెన్యూ అధికారి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన కూడా ఇటీవలి కాలంలో జరిగింది.

కొత్తగా వచ్చిన అధికారులు కూడా అదే ఆచారాన్ని కొనసాగిస్తుండడం గమనార్హం. తాజాగా శనివారం రాత్రి 8 నుంచి 8.30 గంటల మధ్యలో కార్యాలయం నిండా పలువురు రెవెన్యూ అధికారులు బిజీబిజీగా కనిపించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ ఇద్దరు, ముగ్గురు అధికారుల్లో ఒకరు తహసీల్దారు గదిలో ఏవేవో రికార్డులు చేత పట్టుకుని కనిపించడం విశేషం. కార్యాలయం ఆరుబయట అధిక సంఖ్యలో మోటారు సైకిళ్ల పార్కింగ్ చేసి ఉన్నాయి. రాత్రి సమయంలో కూడా అంత అర్జెంటైన పని ఏమిటో అధికారులకే ఎరుక.



శనివారం రాత్రి 8-8.30 గంటల మధ్యలో కార్యాలయంలో బిజీబిజీగా అధికారులు



శనివారం రాత్రి 8.30 తర్వాత కార్యాలయంలోకి వెళ్తున్న వీఆర్వో

అక్రమాలకు అంతే లేదు

కామరాజుపేటలో సీలింగ్ భూములకు నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు ఇచ్చిన వ్యవహారంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల్లో ఒకరు తతంగం నడిపినట్టు ఆరోపణలు ఉన్నాయి. రెండు గ్రామాలకూ బాధ్యత వహించిన (గతంలో) సదరు రెవెన్యూ అధికారి అవినీతిపై రైతులు అనేక ఆరోపణలు చేశారు. భూ సంస్కరణ చట్టం వచ్చిన తర్వాత గంగంపాలెం పంచాయతీ పరిధిలో 16 ఎకరాల భూమిని సదరు భూస్వామి ప్రభుత్వానికి ఇవ్వలేదు. దీనిపై కోర్టులో వ్యాజ్యం నడిచాక ఆ భూమిని సదరు యజమాని ప్రభుత్వానికి ఇచ్చేశారు. కాలక్రమంలో పేదలు వాటిలో సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. మరో రెవెన్యూ అధికారి ఈ భూముల్లో ఓ ఉన్నత స్థాయి అధికారి అండదండలతో మతలబు చేసే ప్రయత్నం చేయగా.. ఆ విషయం బయటకు పొక్కి ప్రజా సంఘాలు రంగంలోకి దిగాయి. దీంతో ఆ రెవెన్యూ అధికారి వెనక్కు తగ్గారు. గుమ్మళ్లదొడ్డిలో కోట్లాది రూపాయలు విలువ చేసే సీలింగ్ భూమిని గతంలో కార్యాలయంలో పనిచేసిన ఓ అధికారి ఇటీవల ఓ మాజీ ఆర్మీ ఉద్యోగికి ఇచ్చినట్టు చూపించారు. అతను ఎవరో, ఎక్కడి వారో కూడా వివరాలు తెలియట్లేదని గ్రామస్తులు చెప్తున్నారు. దీంతో చాలా ఏళ్ల నుంచి ఆ భూమిపై ఆధారపడి జీవిస్తున్న రైతులు రోడ్డునపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూములను నిరుపేదలకు కాకుండా రాజకీయ పలుకుబడి కలిగిన వారికు కట్టబెట్టారన్న అపవాదు ఇక్కడ అధికారులకు ఉంది.

'సిండికేట్' యత్నాలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)





- కొత్తవారికి రాజకీయ ఒత్తిళ్లు
- కుదుటపడని మద్యం షాపులు
- తాత్కాలిక స్థలాల్లో 115 దుకాణాలు



జిల్లాలో మద్యం వ్యాపారులు సిండికేట్ కావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దరఖాస్తు చేసే సమయంలోనే కొందరు సిండికేట్ అయ్యారు. అయినా ఇంకా చాలా మంది దరఖాస్తు చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో 125 షాపులకు దరఖాస్తులు ఆహ్వానించగా 4,384 వచ్చాయి. ఒక్కో దుకాణానికి రూ.2లక్షల వంతున ప్రభుత్వానికి రూ.87.68 కోట్ల ఆదాయం వచ్చింది. ఈనెల 14న లాటరీ తీసి 125 షాపులను అప్పగించిన సంగతి తెలిసిందే. కొత్తవారితో పాటు వేరే ప్రాంతాల వారికీ దక్కాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధుల అనుచరులు కొత్తవారిపై రాజకీయ ఒత్తిళ్లు తెస్తున్నారు. ప్రస్తుతం ఇంకా కొందరికి స్థలాలు దొరకలేదు. గ్రామాల్లో జనాభాను బట్టి హైవేకు 500 మీటర్లు, 250 మీటర్ల దూరంలో షాపు పెట్టాలనే నిబంధన ఉంది. దుకాణ లైసెన్స్‌కు ఏడాదికి నగరాల్లో రూ.80 లక్షలు, గ్రామాల్లో రూ.65 లక్షలు. ఇందులో రెండు నెలల సొమ్ము ముందుగా చెల్లించాలి. నగరాల్లో రూ.14 లక్షలు, గ్రామాల్లో రూ.11లక్షలు ప్రస్తుతం కట్టించుకున్నారు. తాత్కాలిక పర్మిట్లు ఇచ్చారు. జిల్లాలో పాత షాపుల్లో, స్థలం దొరికిన చోట సుమారు 115 దుకాణాలు మొదలుపెట్టారు. కానీ చాలా మంది ఒకే ప్రాంతం, పరిసరాల్లో హడావుడిగా పెట్టేశారు. వీరిందరికీ త్వరలో శాశ్వత పర్మిట్లు ఇస్తారు. ప్రస్తుతం ఉన్న షాపుల్లో కొన్నింటిని వేరే ప్రాంతాలకు మార్చే అవకాశం ఉంది. నిబంధనల ప్రకారం వాటిని మళ్లీ సరైన ప్రాంతాల్లో పెట్టాల్సి ఉంటుంది. మండలంలో ఎక్కడైనా షాపు పెట్టుకోవచ్చనే నిబంధనతో అందరూ గతంలో బాగా అమ్మే దుకాణాల పక్కనే పెట్టుకోవాలనే ఆలోచనతో ఉండడం ఇబ్బందికరంగా మారింది. దీంతో పది షాపులను ఇంకా ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో దుకాణాలు దక్కించుకున్న వారంతా ఒకేమాటపై మండలాలు, నగరాల్లో షాపులను సర్దుబాటు చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో సిండికేట్‌గా మారుతున్నారు. అలా అయితే ఒకచోట ఎక్కువ అమ్మినా, ఒకచోట తక్కువ అమ్మినా ఎవరికీ ఇబ్బంది ఉండదు.

- కొత్తగా దుకాణాలు దక్కించుకున్న వారికి, నాన్ లోకల్ వారికి స్థానిక రాజకీయ నేతల జోక్యం పెరగడంతో వదిలేయాల్సిన పరిస్థితి కూడా ఉంది. 'రూ.2లక్షల దరఖాస్తుతో షాపు దక్కించుకున్న మీకు షాపునకు రూ.20 లక్షల నుంచి రూ.25లక్షలు ఇస్తాం. వదిలేసి వెళ్లిపోవాలి. లేకపోతే ఇక్కడ మీరు వ్యాపారం చేయలేరు. మద్యం షాపుల నిర్వహణలో అనేక సమస్యలు ఉంటాయి. నాన్ లోకల్‌గా అవి తట్టుకోవడం కష్టమే కదా' అని కొందరికి నచ్చచెప్పే ధోరణిలో బెదిరించడం గమనార్హం.
- నల్లజర్ల మండలంలోని పోతవరంలో దుకాణం గోపాలపురం ప్రాంతానికి చెంది గతం నుంచీ మద్యం వ్యాపారం చేసే వ్యక్తికి దక్కింది. లిక్కర్ వ్యాపారంలో అనుభవం ఉన్న ఓ రాజకీయ నేత అతడిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. సుమారు రూ.20లక్షలు ఇస్తాం. దుకాణం వదిలే యమని ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. కానీ మద్యం వ్యాపారం రుచి మరిగిన సదరు వ్యాపారి ససేమిరా అంటున్నట్టు సమాచారం. ఇది ఇంకా ఒక కొలిక్కి రాలేనట్టు సమాచారం.
- గోపాలపురం నియోజకవర్గంలో ఒక ప్రజాప్రతినిధి అనుచరుడు కూడా దుకాణాలను తమకు ఇచ్చేయాలని, లేకపోతే తమకు వాటా ఇవ్వాలని కూడా ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది.
- రాజమహేంద్రవరం సిటీలో వేరే ప్రాంతాలకు చెందిన వారికి రెండు దుకాణాలు రాగా... ఓ ప్రజాప్రతినిధి అనుచరుల ఒత్తిడితో కొంత సొమ్ము తీసుకుని దుకాణాలు వదిలేసినట్టు తెలిసింది.
- అనపర్తిలో నాలుగు దుకాణాలను దగ్గరదగ్గరగా పెట్టేయడంతో ప్రస్తుతం వారి మధ్య చర్చలు జరుగుతున్నట్టు సమాచారం.
- పాతచోట, సొంత ప్రాంతాల్లో ఎవరికి వారు దుకాణాలు పెట్టారు. అమ్మకాలు బాగానే సాగుతున్నాయి. ఈనెలాఖరుకి మద్యం వ్యాపారం ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. శాశ్వత పర్మిట్లతో శాశ్వత స్థలాల్లో పెట్టుకుంటారు. ఈలోపు రాజకీయ బెదిరింపులు, సిండికేట్లు కావడం అంతా మామూలుగానే జరిగిపోతోంది. గతంలో మద్యం వ్యాపారుల చేతుల్లోనే దుకాణాలు ఉండేవి. వారు రాజకీయ నేతలు, ఇతరులకు నెలవారీ ముడుపులు ఇచ్చేవారనే ప్రచారం జరిగేది. ఇవాళ రాజకీయ నేతల అనుచరులు కూడా వ్యాపారంలోకి దిగారు. దీంతో వ్యాపారం రసవత్తరంగా మారనుంది.



అ ధర హో!

- ఆకాశాన్నంటిన ధరలు
- బస్తా (80 కిలోలు) రూ.13,500

జీడి పప్పు... దీని పేరు చెప్తే... నోరు ఉవ్విళ్లూరుతుంది. దైనందిన జీవన విధానంలో జీడిపప్పు లేని వంటకాలు అంతగా రుచించట్లేదని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. అయితే ప్రస్తుత మార్కెట్లో జీడి పప్పు ధరలు ఆకాశాన్నంటడంతో నోటికి రుచించట్లేదు. ఉత్తర భారతంలోని గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాల్లో దసరా, దీపావళి పర్వదినాల్లో జీడిపప్పు వినియోగం ఎక్కువగా ఉండడమే ఇందుకు ప్రధాన కారణంగా వ్యాపారులు చెప్తున్నారు. ఈ కారణంగానే ప్రస్తుతం మన ప్రాంతంలో జీడిపప్పు ధరలు అమాంతంగా పెరిగాయంటున్నారు.

రాజానగరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గత రెండు, మూడేళ్లుగా జీడి పిక్కల బస్తా (80 కిలోలు) రూ.8 వేలు నుంచి రూ.9 వేలు వరకు ఉండేది. ఈ ఏడాది ఏప్రిల్‌లో సైతం ఇవే ధరలు పునరావృతమవుతూ వచ్చింది. గడిచిన ఆరు నెలల్లో పెట్టుబడులకు వడ్డీ, గింజల ఆరుదల కలిపితే ప్రస్తుతం బస్తా రూ.13,500 పలుకుతోంది. గింజలు నిల్వ చేసే అవకాశం లేకపోవడంతో రైతులు ఎప్పటి గింజలను అప్పుడే విక్రయించేశారు. పూర్వపు తూర్పు గోదావరి జిల్లాలో రంపచోడవరం, గోకవరం, నర్సీపట్నం ప్రాంత జీడిపప్పు నాణ్యతకు ప్రసిద్ధిగా వ్యాపారులు చెప్తున్నారు. మన ప్రాంతంలో భారీ పరిశ్రమలు స్వల్పంగా ఉండగా... కుటీర పరిశ్రమలు, దుకాణాలు విరివిగా నడుస్తున్నాయి. మన ప్రాంతం నుంచి జీడిపప్పును బెంగళూరు. మంగుళూరు, హైదరాబాదు ప్రాంతాలకు నిత్యం ఎగుమతి చేస్తుంటారు.

బస్తాకు దిగుబడి...

నాణ్యమైన జీడి పిక్కలు (80 కిలోల) బస్తాకు 20 కిలోల వరకు పప్పు దిగుబడి వస్తుంది. నాసిరకం అయితే 16 కిలోలు వస్తుంది. జీడి పిక్కల నుంచి చిన్నపాటి ముక్క, నూకతో పాటు తొక్కలు కూడా వృథా కావపోవడం విశేషంగా చెప్పొచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలుగా కొనసాగుతున్న ఇవి అనేక మంది మహిళలకు జీవనోపాధి కల్పిస్తున్నాయి.

మార్కెట్లో ప్రస్తుత ధరలు...

జీడి పప్పు ప్రస్తుత మార్కెట్లో మంచి డిమాండ్ సంతరించుకుంది. గత రెండు, మూడేళ్లుగా చూస్తే జీడి పప్పు ఈ సీజన్లో కిలో రూ.550 నుంచి రూ.600 వరకు ఉండేది. ప్రస్తుతం కిలోకి సరాసరి రూ.200 వరకు పెరగడంతో కొనుగోలు చేసేందుకు వెనకాడే పరిస్థితి నెలకొని, అమ్మకాలు సైతం తగ్గాయని వ్యాపారులు వివరిస్తున్నారు. జీడి పప్పు (జంబో గుండు) రకం ప్రస్తుతం కిలో రూ.900 నుంచి రూ.950 వరకు, నెం.2 రకం గుండు రూ.800 వరకు, బద్ద రూ.650 నుంచి రూ.750 వరకు వున్నాయి. గతంలో ఈ సీజన్లో కిలో రూ.550 నుంచి రూ.600 వరకు వున్న జీడి పప్పు ప్రస్తుతం కిలోకి సరాసరి రూ.200 వరకు పెరగడంతో కొనుగోలు చేసేందుకు వినియోగదారులు రాక అమ్మకాలు సైతం తగ్గాయని వ్యాపారులు వాపోతున్నారు.



అట్టపెట్టెల్లో ఎగుమతికి సిద్ధం చేసిన జీడి పప్పు

రేపు రాజానగరంలో జాబ్ మేళా

రాజానగరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి కల్పనలో భాగంగా నిరుద్యోగ యువతకు రాజానగరంలో మంగళవారం నిర్వహించతలపెట్టిన జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని తూర్పు గోదావరి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో మూడు కంపెనీలు పాల్గొంటున్నాయని జిల్లా ఉపాధి కల్పన అధికారి హరిశ్చంద్రప్రసాద్ తెలిపారు. ఎస్ఎస్‌సీ/ఇంటర్/డిగ్రీ/డిప్లొమా, ఐటీఐ, డి.ఫార్మసీ, బీ.ఫార్మసీ, ఎంబీఏ విద్యార్హతలతో 19 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు పూర్తి వివరాలతో రిజిస్టరు అయి రెజ్యూమ్‌తో రాజానగరం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8328507473, 7396740041 నెంబర్లలో కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఓపెన్‌సైట్ కేటగిరీలో రైఫిల్ షూటింగ్ జాతీయ జట్టు ఎంపిక

- 6లో

వరద బాధితులకు ఆర్థికసాయం

తాళ్లపూడి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆదివారం మండలంలోని టాటా వాటర్ ప్లాంట్ తరపున అరుణజ్యోతి బయో వెంచర్స్ మేనేజర్ మధు 50 వేల చెక్కును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు పారిశ్రామికవేత్త జీవీ ప్రసాదు సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో యువగళం నాయకులు కూచిపూడి గణేష్, తొండెపు భరత్ కుమార్, కాంట్రాక్టర్ మేణ్ణి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో కుళాయి ఏర్పాటు

తాళ్లపూడి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంక గ్రామంలోని అభయాంజనేయ దేవస్థానం కమిటీ చైర్మన్ సొలస కాశీ విశ్వనాథం తన తల్లిదండ్రులు, సోదరుడు సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం ఆదివారం కుళాయిని ఏర్పాటు చేశారు. ఈ మంచినీటి కుళాయిని గ్రామ నాయకులు యాళ్ల బాబూరావు ప్రారంభించారు. దాతల సేవా తత్పరతను పలువురు అభినందించారు. కార్యక్ర మంలో ముళ్ల మల్లిబాబు, సొలస మణికంఠ, నాయుడు హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.



బురదగా మారిన దేవరపల్లిలోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారి

రోడ్డు ఇలా ఉంటే ప్రయాణం ఎలా?

● చిత్తడిగా మారిన జగనన్న కాలనీ ● సీసీ రోడ్డు వేయాలని వినతి

దేవరపల్లి, అక్టోబరు 20: దేవరపల్లిలో జగనన్న కాలనీకి వెళ్లే రహదారి చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. గతంలో 1200 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా, ఇప్పటికి 200 మంది నిర్మాణాలు చేపట్టి నివాసం ఉంటున్నారు. కాలనీలోకి వెళ్లడానికి రోడ్డు బురదమయం అవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి వెళ్లే రహదారికి గ్రావెల్ రోడ్డు వేయాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు. అన్ని వీధుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. వర్షం వస్తే బురదలోంచి రావాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. కనీసం మోటార్ సైకిల్ కూడా వెళ్లే పరిస్థితి కనిపించటం లేదని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన రోడ్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

అందరి హృదయాల్లో నిలిచిన రాజబాబు

హాస్య నటుడు రాజబాబు జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబర్ 20: ప్రముఖ హాస్య నటుడు రాజబాబు 88వ జయంతి వేడుకలు ఆదివారం గోదావరి గట్టున ఉన్న రాజబాబు విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. రాజబాబు తమ్ముడు బాబి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రాజబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజబాబు 590 చిత్రాల్లో నటించి అందరి హృదయాల్లో చిరస్థాయిగానిలిచిపోయారన్నారు. రాజబాబు మేనల్లుడు బీఎస్ఎన్ఎల్ వాసు, వెంకటేశ్వరరావు, పట్నాయక్, గణేష్, లక్ష్మీ నారాయణ, మల్లు రవి పాల్గొన్నారు.



హాస్యనటుడు రాజబాబు విగ్రహం వద్ద జయంతి వేడుకలు దృశ్యం

బీసీలకు రక్షణ చట్టం చేయాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి నూకాలమ్మ



కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 20: బీసీలకు రక్షణ చట్టం చేయాలని, కులగణన చేపట్టాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి వై.నూకాలమ్మ, సంఘం జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు కోరారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం, ఆ దిశగా కృషి సాగిస్తోందని, ఇది శుభపరిణామమని వారు పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి అధ్యక్షుడు లద్దిక మల్లేష్ మాతృమూర్తి మృతి నేపథ్యంలో స్థానిక గంటాలమ్మ గుడి వద్ద ఉన్న మల్లేష్ ఇంటికి విచ్చేసిన నూకాలమ్మ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, బీసీల తరపున 40 మంది ఎమ్మెల్యేలు, 9 మంది మంత్రులయ్యారని, 9 మంది పార్లమెంటుకు వెళ్లారని గుర్తుచేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల హామీ మేరకు బీసీలకు రక్షణ చట్టం తీసుకురావడానికి ఇప్పటికే మీటింగ్ ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకుడు కేకే సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

రాజానగరంలో విద్యుత్ హైవోల్టేజ్ సరఫరా

» గృహోపకరణాలు దగ్ధం
» రూ.10 లక్షలు మేర ఆస్తి నష్టం
» పట్టించుకోని విద్యుత్ అధికారులు
» గగ్గోలు పెడుతున్న వినియోగదారులు





హై ఓల్టేజీతో దగ్ధమైన విలువైన గృహోపకరణాలు

రాజానగరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు తీవ్రమైన నష్టం వాటిల్లిందని రాజానగరంలోని వైఎస్సార్ జంక్షన్ సమీపంలోని నివాసితులు వాపోతున్నారు. తమ ప్రాంతంలో రెండు రోజులుగా విద్యుత్ సరఫరాలో లోపాలు తలెత్తుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని అధికారు లకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తమ ప్రాంతంలో విద్యుత్ హెచ్చుతగ్గులు రావడంతో దాదాపు 15కుటుంబాలకు సంబంధించిన టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, కూలర్లు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, కంప్యూ టర్లు, ల్యాప్‌లాప్‌లు, పరుపులు తదితర విలువైన గృహోపక రణాలు దగ్ధం కావడంతో సుమారు రూ.10లక్షలు మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు చెప్పారు. గత 20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని ఇంతవరకు ఇటువంటి పరిస్థితులు చూడలేదన్నారు. సుమారు 50సార్లుగా అప్పటికప్పుడే హైవోల్టేజీ, వెంటనే లోవోల్టేజీ రావడం వల్లనే ఈ ఇబ్బందులు తలెత్తినట్లు బాధితులు రాయుడు విజయ భారతి, గోకా దేవి, నీలపాల వీర్రాజు, మంద సత్తిబాబు, ప్రగడ సుబ్బారావు తెలిపారు. ఈవిషయమై రాజానగరం విద్యుత్ శాఖ ఏఈ సుధాకర్‌ను వివరణ కోరగా ప్రమాదం జరిగినమాట వాస్తవమే అయితే ఆ ప్రాంతంలో కొంతమంది ఇళ్లకు ఎర్తింగ్‌లు సక్రమంగా లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని బదులిచ్చారు.

యూపీహెచ్‌సీలను మెడికల్ అండ్ హెల్త్‌లో

విలీనం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను (యూపీహెచ్‌సీ) నేషనల్ హెల్త్ మిషన్ నుంచి మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్‌లో విలీనం చేయాలని యూపీహెచ్‌సీ యూనియన్ జిల్లా నాయకులు కేపీ నాయుడు, జేవీవీ సత్యనారాయణ కోరారు. ఆదివారం రాజమహేంద్రవరం వై జంక్షన్‌లోని హెల్త్ సెంటర్‌లో యూపీహెచ్‌సీ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యూపీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలనే సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా యూపీహెచ్‌సీ ఎంప్లాయీస్ యూనియన్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా బి.పవన్, జిల్లా అధ్యక్షురాలిగా వి.వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా అనిత, వెంకట్, కాశి, నరేష్, కోశాధికారిగా జీటీపీ కుమార్, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో అనన్యకు రెండో స్థానం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆ ధ్వర్యంలో విజయనగరంలో జరిగిన అండర్-9 బాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన చింతా అనన్య రెండో స్థానం సాధించింది. డిసెంబరులో పూణేలో జరుగనున్న



జాతీయ పోటీల్లో మన రాష్ట్రం తరుపున అనన్య ప్రాతినిధ్యం వహిస్తుందని జిల్లా చదరంగం సంఘం అధ్యక్షుడు జీవీ కుమార్ తెలిపారు. ఎంకె అకాడమీ కోచ్‌లు జి.కార్తీకగోపాల్, జి.హేమచంద్రమౌళితో ట్రైనింగ్ పొం దుతోందని అనన్య తల్లిదండ్రులు తెలిపారు.

వెంటాడుతున్న నీటి సమస్య

● కరగపాడు, బుచ్చయ్యపాలెం వాసుల దాహం కేకలు ● పట్టించుకోని యంత్రాంగం


గోపాలపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది కరగపాడు, బుచ్చయ్యపాలెం గ్రామ ప్రజల పరిస్థితి. బుచ్చయ్యపాలెంలో నీటి సమస్య ఎక్కువగా ఉండటంతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌తో యుద్ధ ప్రతిపాదికన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మించింది. తదనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అది ప్రారంభానికి నోచుకోలేదు. ప్రజలగోల భరించలేక ట్యాంకు నిర్మాణానికి సుదూర ప్రాంతంలో ఎంపీపీ నిధులతో బోరు వేశారు. అయినప్పటికి గ్రామంలో నీటి సమస్య అపరిష్కృతంగా ఉండిపోయింది. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు గ్రామస్థులు నీటి సమస్య తెలిపారు. యుద్ధ ప్రాతిపాదికన సమస్య పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కడ?

కరగపాడు గ్రామంలో నీటి సరఫరాకు అవసరమయ్యే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకు బోరు ఉన్న నీటి సరఫరాకు అవసరమయ్యే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ధ్వజమెత్తుతున్నారు.

వెంటాడుతున్న విద్యుత్ సమస్య

బుచ్చయ్యపాలెంలో లోఓల్టేజీ సమస్య వెంటాడుతోంది. ప్రతినెలా కరెంటు బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్నా లోఓల్టేజ్ పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. వెంటనే నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లోఓల్టేజ్ సమస్య పరిష్కరించాలని బుచ్చయ్యపాలెం ప్రజలు కోరుతున్నారు.



బుచ్చయ్యపాలెంలో ప్రారంభానికి నోచుకోని ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకు



విద్యార్థులకు అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

విద్యార్థులకు అన్నదానం

కొవ్వూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మదర్ థెరిసా వీధి బాలల పునరావాస కేంద్రంలో ఆదివారం విద్యార్థులకు అన్నదానం చేశారు. కొవ్వూరు లయన్స్ క్లబ్ సభ్యుడు పాలింపాటి నరేంద్రనాథ్ చౌదరి పుట్టినరోజు వేడుకలను సత్యవతి నగర్‌లోని వీధిబాలల పునరావాస కేంద్రంలో కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు చినబాబు చౌదరి, సుబ్బలక్ష్మి, మద్దిపాటి సత్యనారాయణ, గోలి వెంకటరత్నం, యనమదల సుబ్రహ్మణ్యం, కంటమణి కిషోర్, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, మన్యం బుల్లిబాబు, పెనుమాక జయరాజు, ఎండి హుస్సేన్, ముళ్ళపూడి కాశీ విశ్వనాథం, యు.రామకృష్ణ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



దేచర్ల గ్రామంలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ప్రక్కిలంక గ్రామ సర్పంచ్ యాళ్ల స్వప్నతో కలిసి సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయుడు హనుమంతరావు, జీవీ ప్రసాదు తదితరులతో పాటు జనసేన వీర మహిళ వేణు మాధవి, యాళ్ల బాబూరావు, ఎంపీడీవో రమణ, డీఈ శ్రీనివాసరావు, ఏఈ త్రిమూర్తులు, ఏపీవో రమాదేవి తదితర కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం పెద్దేవం గ్రామంలో ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే మాట్లాడారు.

పల్లె పండుగలో ఎమ్మెల్యే ముప్పిడి

అనంతరం ఎన్ఆర్‌జీఎస్ నిధులతో చేపట్టే పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, కోడి శంకరం తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు. తిరుగుడుమెట్ట గ్రామంలో బీసీ, ఓసీ ఏరియాల్లో ఎన్ఆర్‌జీఎస్ నిధులతో పలు రోడ్లకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎన్‌డీఏ కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కొవ్వూరు: పంచాయతీల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం దేచర్ల, కుమారదేవం గ్రామాల్లో పల్లె పండుగ నిర్వహించారు. దేచర్ల గ్రామంలో ఎమ్మెల్యేకు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం దేచర్ల గ్రామంలో అంతర్గత రోడ్డు పనులకు, కుమారదేవం గ్రామంలోని హౌసింగ్ లేఅవుట్‌లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పంగిడి, కుమారదేవం గ్రామాల సర్పంచ్‌లు గోశాల నాగార్జున, కాసాని దుర్గ, ఎంపీడీవో కె.సుశీల తదితరులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించడంలో భారత్ వికాస్ కృషి

» ఆచార్య దోర్బల ప్రభాకరశర్మ » కొవ్వూరులో జాతీయస్థాయి బృందగాన పోటీలు

కొవ్వూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడిలో విద్యార్థి దశ నుంచి దేశభక్తిని పెంపొందించడానికి భారత్ వికాస్ పరిషత్ కృషి చేయడం అభినందనీయమని ఆచార్య దోర్బల ప్రభాకరశర్మ అన్నారు. ఆదివారం కొవ్వూరు పరిమి రామారాయుడు రత్తమ్మ కళ్యాణ మండపంలో డాక్టర్ రమేష్ యల్లాప్రగడ అధ్యక్షతన భారత్ వికాస్ పరిషత్ ప్రాంత జాతీయ బృందగాన పోటీలను నిర్వహించారు. హిందీ, తెలుగు, సంస్కృతం, జానపద గీతాల పోటీలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, డాక్టర్ కేఎస్ఎన్ మూర్తితో కలిసి ప్రభాకరశర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపర్క్, సహయోగ్, సంస్కార్, సేవ సమర్పణ్ పరమావిధిగా విద్యార్థుల్లో దేశభక్తి, సేవాతత్పరతను పెంపొందించడానికి భారత్ వికాస్ పరిషత్ 62 ఏళ్లుగా కృషి చేస్తోందన్నారు. ఈ పోటీల్లో హిందీ, సంస్కృత విభాగాల్లో 8 బృందాలు, తెలుగు, జానపద విభాగాల్లో 9 బృందాలు పాల్గొన్నాయి.



జాతీయ బృందగాన పోటీల కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



పోటీల్లో గీతాలాపన చేస్తున్న విద్యార్థులు

ప్రథమ బహుమతి డీఏవీ స్కూల్ అనకాపల్లి, ద్వితీయ బహుమతి విశాఖ వ్యాలీ విశాఖపట్నం, తృతీయ బహుమతి శ్రీప్రకాష్ విద్యానికేతన్ పాయకరావుపేట, మోటివేషన్ బహుమతి డీపీఏ పాఠశాల కొవ్వూరు బృందాలు ఎంపికయ్యాయి. ప్రథమస్థానంలో నిలిచిన డీఏవీ స్కూల్ అనకాపల్లి బృందం హిందీ, సంస్కృత విభాగంలో సౌత్ విభాగం హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో విశాఖపట్నం, కొవ్వూరు, తుని, అనకాపల్లి, రాజమహేంద్రవరం, కుమారదేవంకు చెందిన విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి గేయాలు ఆలపించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ ప్రాంత అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు, జీబీవీ సుబ్రహ్మణ్యం, తాడోజు సాయికృష్ణ, సౌత్ రీజియన్ జనరల్ సెక్రటరీ పురుషోత్తమ శాస్త్రి, రీజనల్ జాయింట్ సెక్రటరీ ఎంవీవీ సత్యనారాయణ, బి.సుబ్బారావు, భారత్ వికాస్ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన అవసరం

» మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు వాసు, బత్తుల
» రాజమహేంద్రవరంలో పింక్ 5కే రన్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రొమ్ము కేన్సర్‌పై మహిళలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ అన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం పింక్ 5కే రన్ నిర్వహించారు. ఆదివారం స్థానిక పుష్కరాల రేవు వద్ద ఈ రన్ ప్రారంభ కార్యక్రమానికి మంత్రి దుర్గేష్,ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం ఎస్సెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంతను దాస్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, బత్తుల విచ్చేశారు. ఈ రన్ పుష్కర ఘాట్ వద్ద నుంచి ప్రారంభమై గోదావరి బండ్, స్టేడియం రోడ్డు, జాంపేట, కోటగుమ్మం మీదుగా తిరిగి పుష్కరాల రేవు వద్దకు చేరుకుంది. ఈ రన్‌లో సుమారు 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన చెల్లుబోయిన వెంకటప్రదీప్, కిలపర్తి భాస్కర్, ముదిలి శరత్ చంద్రప్రసాద్‌కు నగదు బహుమతులను అందజేశారు. విజేతలు ముగ్గురూ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులే. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల జీఎస్ఎల్ కేన్సర్ హాస్పిటల్ ప్రస్థానాన్ని ప్రస్తావించి ప్రజలకు డాక్టర్ గన్ని భాస్కరరావు, ఆయన బృందం అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ కొన్నేళ్లుగా రొమ్ము కేన్సర్ కేసులు ఎక్కువవుతు న్నాయని వాటిపై అవగాహన కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గన్ని భాస్కరరావు మాట్లాడుతూ కేన్సర్‌ను ముందే గుర్తిస్తే అంత సురక్షితంగా కోలుకునే అవకాశం వుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత గన్ని కృష్ణ, జీఎస్ఎల్ కేన్సర్ హాస్పిటల్ డైరెక్టర్, సర్జికల్ ఆంకాలజీస్ట్ డాక్టర్ తరుణ్ గోగినేతో పాటు వివిధ రంగాల ప్రముఖులు, జీఎస్ఎల్ విద్యాసంస్థల, ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, ఓఎన్‌జీసీ ఈడీ శంతనుదాస్

26 నుంచి ఆధ్యాత్మిక యాత్ర

» ఆరు పుణ్యక్షేత్రాలను కలుపుతూ బస్సు ఏర్పాటు
» ఒక్క రోజు యాత్ర
» పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వారాంతంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించేవిధంగా ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక దేవాలయాలు, పంచారామక్షేత్రాలు సందర్శించేలా ఒక రోజు టూర్ ప్యాకేజీకి పర్యాటక శాఖ సన్నాహాలు చేస్తోందన్నారు. అసెంబ్లీలో శాసనసభ్యుల సూచనల మేరకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. యాత్ర కోసం బస్సును ఏర్పాటు చేశామని, దానిలో 18 సీట్లు ఉంటాయన్నారు. ఈ బస్సు కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామం, వాడపల్లి ఆలయాలను కలుపుతూ రూట్ నిర్ధారించామన్నారు. బస్సును రాజమహేంద్రవరం సరస్వతి ఘాట్ వద్ద టూరిజం శాఖకు సంబంధించిన సమాచారం, రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం వద్ద ఈనెల 26న ఉదయం 6గంటలకు ప్రారంభిస్తామన్నారు. ఉదయం బయలుదేరి యాత్ర పూర్తి చేసుకుని రాత్రి 7:30గంటలకు తిరిగి రాజమహేంద్రవరం చేరుకుంటుందన్నారు. బస్సు టిక్కెట్ పెద్దలకు రూ.వెయ్యి, 3-10 ఏళ్ల చిన్నారులకు రూ.800గా నిర్ణయించారన్నారు. ప్రకృతి రమణీయత, ఆధ్యాత్మిక కలయికగా ఉన్న ఈ టూర్ ప్యాకేజీని యాత్రికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. 26న ప్రారంభోత్సవంలో తాను, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, టూరిజం శాఖ ఉన్నతాధికారులు, బోర్డు డైరెక్టర్లు పాల్గొంటారని తెలిపారు.

హైస్కూల్ ప్లస్ తరగతులను

వేరు చేయాలి

ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ త్రినాథబాబు

దివాన్‌చెరువు, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల నుంచి హైస్కూల్ ప్లస్ తరగతులను వేరు చేసి జడ్పీ జూనియర్ కళాశాలలుగా గుర్తించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు అన్నారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జీవో 117 రద్దుకు సిద్ధపడడం హర్షణీయమన్నారు. ఈ ఉత్తర్వులు అమలు చేయడం ద్వారా ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. అలాగే ఏకోపాధ్యాయ పాఠశాలలు సంఖ్య కూడా మన రాష్ట్రంలో బాగా అధికమైందన్నారు. ఈ క్రమంలో జీవో 117 రద్దుకు ప్రభుత్వం సంసిద్ధత తెలపడంతో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో చేపట్టవలసిన ప్రత్యామ్నాయ ప్రతిపాదనలపై ఎస్టీయూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు లేఖ రాసిందని చెప్పారు. వాటిని పరిగణలోనికి తీసుకుని ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని త్రినాథబాబు కోరారు.

కోళ్లఫారాలతో ఇబ్బందులు పడుతున్నాం

పెరవలి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నడిపల్లిలోనున్న కోళ్లఫారాల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. ఇటీవల అధికారులు గ్రామంలో విచారణ జరిపినప్పటికి సమస్య పరిష్కారం కాలేదని ఆరోపిస్తున్నారు. కోళ్ళఫారాల నుంచి వచ్చే దుర్గంధంతో పాటు ఈగలు వల్ల తాము ఇళ్ళల్లో ఉండలేని పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపిస్తున్నారు. అధికా రులు సమస్య పరిష్క రించకపోతే న్యాయ పరంగా పోరాడతామని గ్రామానికి చెందిన డాక్టర్ ఈడ్పుగంటి వీరవెంకట రమేష్ అన్నారు.

గంబూషియా చేపలతో

దోమల నివారణ



చెరువులో గంబూషియా చేపలు వదులుతున్న దృశ్యం

కడియం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు గంబూషియా చేపలు తోడ్పడతాయని కడియపులంక పీహెచ్‌సీ డాక్టర్ జెన్సీ సుప్రియ అన్నారు. దోమల లార్వా నిర్మూలనలో భాగంగా కడియం మత్స్యశాఖ ఇచ్చిన గంబూషియా చేపలను పీహెచ్‌సీ పరిధిలోని వెంకయ్యమ్మపేటలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వదిలినట్టు చెప్పారు. దోమలు పెట్టిన లార్వాను ఈ చేపలు తింటాయని తద్వారా దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది జెహానోక్, శ్రీనివాస్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏకం ఆధ్యాత్మిక జాగృతి

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సూర్యహోటల్‌లో ఆదివారం ఏకం ఆధ్యాత్మిక జాగృతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏకం దాసాజీ ఆప్తి దైనందిన జీవితంలో ఒత్తిడిని తగ్గించుకోవడానికి, శారీరక వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవడానికి పలు సూచనలు, సలహాలు అందించారు.

ఫ్రీజర్ కొనుగోలుకు ఆర్థిక సాయం

గోపాలపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులే మిన్నమైనవని మానవత మండల చైర్మన్ జొన్నగడ్డ రాంబాబు అన్నారు. ఫ్రీజర్ కొనుగోలుకు కొండేపాటి కృష్ణ జ్ఞాపకార్థం చిట్యాల గ్రామానికి చెందిన వారి మనుమలు కేవీవీ సతీష్‌కుమార్, కేవీవీ ప్రదీప్‌కృష్ణ, ఎంయూ శంకర్‌నాగ్, ఎంబీజీ రామన్న, చింతపల్లి రాధిక, ఆర్థికసాయంతో సమకూర్చిన రూ.80వేలు చెక్కును కొండేపాటి రత్నాజీ చౌదరి, దేవీపుష్పవతి దంపతులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో గడా జోగేంద్రప్రసాద్, రాధాకృష్ణ, జుత్తిగ వెంకట్, కుక్కల కీర్తికుమార్, కొయ్యే నాగరాజు పాల్గొన్నారు.